
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



విశాఖపట్నం

జిల్లా వార్తలు

బుధవారం 16 అక్టోబరు 2024

మెరుగుపడనున్న ఇసుక సరఫరా

- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్: కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్



విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):
జిల్లాలో అవసరాలకు అనుగుణంగా ఇసుక సరఫరాకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, త్వరలో సమస్య పరిష్కారమవుతుందని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ అన్నారు. మంగళవారం తనను ... మిగతా 8వ పేజీలో



...ఇవి తింటే అంతే సంగతులు

ఈ ఆయిల్‌తో ఆరోగ్యానికి ముప్పు

పదేపదే మరిగించిన నూనెలో తయారైన ఆహార పదార్థాలు తీసుకోవడం ప్రమాదం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రుచిగా ఉన్నాయని బజ్జీలు, పునుగులు, సమోసాలు వంటి వాటిని బయట తింటుంటాం. కానీ అవి ఎలా తయారవుతున్నాయో పట్టించుకోం. అదే ఆరోగ్యానికి ప్రమాదం. ఇటువంటి ఆహార పదార్థాలను తయారుచేసే అనేక దుకాణాల్లో వినియోగించే వంట నూనె చూస్తే ఎవరికైనా మతిపోతుంది. నల్లగా మాగిన నూనెలో ఈ వంటకాలు తయారుచేస్తుంటారు.

- స్వల్పకాలంలో జీర్ణ సంబంధిత సమస్యలు ఉత్పన్నం
- దీర్ఘకాలంలో పొట్ట, అన్నవాహిక కేన్సర్ వంటి వాటి బారినపడే ప్రమాదం ఉందని వైద్యుల హెచ్చరిక
- వీలైనంత వరకూ బయట ఆహారానికి దూరంగా ఉండడం మంచిది

పదే పదే వాడిన నూనెలో తయారైన ఆహార పదార్థాలను తీసుకోవడం ఆరోగ్యానికి అత్యంత హానికరమని వైద్యులు పేర్కొంటున్నారు. నల్లగా మాగిన నూనెలో వండిన వంటకాలు తినడం వల్ల ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆయిల్‌ను పదేపదే వేడి చేయడం వల్ల కార్బన్ విడుదల అవుతుందని, అది శరీరానికి హాని చేస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఈ కార్బన్ వల్ల కడుపు, అన్నవాహిక కేన్సర్లు వస్తాయని ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ గిరినాథ్ తెలిపారు. అటువంటి ఆయిల్‌లో వేయించిన పదార్థాలను



నల్లగా మారిన నూనె

తీసుకున్న వెంటనే గ్యాస్ట్రిక్, అల్సర్లు, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు వేధిస్తాయని చెబుతున్నారు. మరిగించిన ఆయిల్‌లో వండిన పదార్థాలను తినడం వల్ల పిల్లల్లో ఒబెసిటీ, జీర్ణ సంబంధిత సమస్యలు వేధిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

టోటల్ పోలార్ కాంపౌండ్ మీటర్స్‌తో నిర్ధారణ

ఆయిల్‌ను ఎన్నిసార్లు వినియోగించారనే విషయాన్ని ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అధికారులు నిర్ధారించేందుకు అవకాశం ఉంది. ఇందుకోసం ... మిగతా 8వ పేజీలో

జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా డోలా



- ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తా
- ప్రజా ప్రతినిధులు, అధికారులను సమన్వయం చేసుకుంటూ జిల్లా అభివృద్ధికి పాటుపడతా
- ఏఎంసీలో చదువుకున్నా...
- నగరంపై అవగాహన ఉంది
- 'ఆంధ్రజ్యోతి'తో మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి

విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):
జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి నియమితులయ్యారు. ప్రభుత్వం మంగళవారం అన్ని జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులను నియమించింది. రాష్ట్రంలో ప్రధానమైన విశాఖపట్నం జిల్లాకు సాంఘిక సంక్షేమ, విభిన్న ప్రతిభావంతుల శాఖా మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామిని నియమించింది. వీరాంజనేయస్వామి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రకాశం జిల్లా కొండెపి నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆయన 1990లో ఆంధ్ర వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చేశారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు

రాష్ట్రంలో అత్యంత కీలకమైన విశాఖ జిల్లా ఇన్‌చార్జిమంత్రిగా తనకు అవకాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ... మిగతా 8వ పేజీలో

చోటా నేతల కాసుల వేట

- బాణసంచా దుకాణాలపై కన్ను
- బినామీ పేరుతో లీజుకు ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానం
- ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్, ఏఎస్ రాజా మైదానంలో కలిపి 300 షాపుల ఏర్పాటుకు సన్నాహాలు
- రూ.లక్ష చొప్పున వ్యాపారులకు విక్రయం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

దీపావళి నేపథ్యంలో కూటమికి చెందిన కొంతమంది చోటా నేతలు దందా మొదలెట్టారు. బినామీ పేర్లతో ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానాన్ని లీజుకు తీసుకుని అక్కడ దుకాణాలను ఏర్పాటుచేసి ఒక్కొక్కటి రూ.లక్షకు విక్రయిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఏటా దీపావళి పండుగ సందర్భంగా ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానం, ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మైదానం, గాజువాకలోని లంకాగ్రౌండ్స్‌తో పాటు నగరంలో పలు చోట్ల బాణసంచా దుకాణాలను ఏర్పాటుచేస్తుంటారు. సాధారణంగా బాణసంచా వ్యాపారులే ఒక సంఘంగా ఏర్పడి ఆయా మైదానాలు, ఖాళీ స్థలాలను యజమానుల నుంచి లీజుకు తీసుకుంటారు. తర్వాత జీవీఎంసీ, పోలీస్, ఫైర్ సేఫ్టీ అధికారుల నుంచి అనుమతులు తీసుకుని దుకాణాలను ఏర్పాటుచేస్తారు. దీపావళికి రెండు రోజులు ముందు నుంచి బాణసంచా విక్రయాలు ప్రారంభిస్తారు. అయితే ఈసారి కూటమి పార్టీలకు చెందిన కొందరు చోటా నేతలు బాణసంచా దుకాణాలపై కన్నేశారు. దుకాణాలను ఏర్పాటుచేసి వ్యాపారులకు విక్రయించడం ద్వారా సొమ్ము చేసుకోవాలని పథకం రచించారు. అందులో భాగంగానే తూర్పు నియోజక వర్గానికి చెందిన ... మిగతా 8వ పేజీలో



రెండు మైదానాల ద్వారా రూ.36.43 లక్షలు ఆదాయం

- ఏయూ అధికారులు
- గత ఏడాది కంటే సుమారు రూ.4 లక్షల మేర పెరిగినట్టు వెల్లడి

విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):
ఆంధ్ర యూనివర్సిటీలోని మైదానాలను బాణసంచా దుకాణాలు ఏర్పాటు నిమిత్తం ఏటా అధికారులు అద్దెకు ఇస్తుంటారు. ఈ ఏడాది దీపావళి మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ దరఖాస్తు చేసుకోగా అనుమతి ఇచ్చినట్టు వెల్లడించారు. ఇంజ నీరింగ్ కాలేజీ మైదానాన్ని (మెయిన్ గ్రౌండ్) రూ. 18,21,620కు, హెలీ ప్యాడ్ మైదానాన్ని రూ.18,21,620కు అద్దె కు ఇచ్చామని, గత ఏడాదితో పోలిస్తే సుమారు నాలుగు లక్షల రూపాయలు అదనపు ఆదాయం లభించినట్టు ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎస్ ధనుంజయ రావు తెలిపారు. గడిచిన ఏడాది మెయిన్ గ్రౌండ్‌ను రూ.14,40,100కు, దానికి ఎదురుగా కొత్తగా తయారుచేసిన మైదానాన్ని రూ.14,40,100కు అద్దెకు ఇచ్చారు. అలాగే, బీచ్ రోడ్డులోని మెరీన్ గ్రౌండ్‌ను రూ. 3,43,300కు ఇచ్చారు. గడిచిన ఏడాది దీపావళి పండగ సందర్భంగా మైదానాలను అద్దెకు ఇవ్వడం ద్వారా వర్సిటీకి మొత్తం రూ.32,23,500 ఆదాయం సమకూరింది. ఈ ఏడాది రెండు మైదానాల ద్వారా సుమారు రూ.36.43 లక్షలు ఆదాయం లభించినట్టు తెలిపారు.



మెడ్‌టెక్ జోన్‌లో పర్యటిస్తున్న కేంద్రమంత్రి జయంత్ చౌధరి

మెడ్‌టెక్ జోన్‌కు కేంద్ర మంత్రి జయంత్

- అన్ని విభాగాలు పరిశీలన.. పనితీరుపై సంతృప్తి
- నాడు చంద్రబాబునాయుడు ముందుచూపుతో ఈ ప్రాజెక్టును ప్రారంభించారంటూ ప్రశంసలు
- కేంద్రం అన్నివిధాలా సహకరిస్తుందని హామీ

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):
కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, విద్యా శాఖల సహాయ మంత్రి జయంత్ చౌదరి మంగళవారం ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ (ఏఎంటీజెడ్)ను సందర్శించారు. తొలుత భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆయన అనంతరం మెడ్‌టెక్ జోన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సవాళ్లను అధిగమించి ముందుకుసాగితే అద్భుత ఫలితాలు సాధించవచ్చునన్నారు. ఉత్తమమైన ఆలోచనలు, ఆవిష్కరణలకు మెడ్‌టెక్ జోన్ కేంద్రంగా నిలుస్తుందన్నారు. 2018లో నాడు ముఖ్యమంత్రిగా ఉన్న ... మిగతా 8వ పేజీలో

గంటలకు గంటలు ఫోన్‌లోనే..!



కొంతమంది పది గంటలకు పైగా....

- మరికొంతమంది ఐదారు గంటలు...
- సామాజిక మాధ్యమాలకు ఎక్కువ సమయం వినియోగిస్తున్న యువత
- ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సైట్స్‌లో కనీసం రెండు నుంచి మూడు గంటలు

... వార్త 8వ పేజీలో

నేటి నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు



- ప్రభుత్వ దుకాణాలు ఎత్తివేత
- గడచిన ఐదేళ్లలో చేపట్టిన లావాదేవీల లెక్క తేల్చేందుకు 16 బృందాలు ఏర్పాటు

విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):
జిల్లాలో బుధవారం నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభం కానున్నాయి. మొత్తం 155 దుకాణాలను సోమవారం లాటరీ ద్వారా కేటాయించిన విషయం తెలిసిందే. షాపులు దక్కించుకున్నవారు నిబంధనల మేరకు మంగళవారం లైసెన్స్ ఫీజు చెల్లించారు. ఇతరత్రా బ్యాంకు గ్యారంటీలు సమర్పించారు. అదేవిధంగా సొమ్ములు చెల్లించి డిపోల నుంచి సరుకు తీసుకున్నారు. మరికొందరు బుధవారం సరుకు తెచ్చుకునేందుకు ఏర్పాట్లుచేసుకున్నారు. ఇదిలావుండగా గడచిన ఐదేళ్ల నుంచి ప్రభుత్వం ఆధీనంలో నడుస్తున్న మద్యం దుకాణాలు మంగళవారం రాత్రి పది గంటలకు మూతపడ్డాయి. దుకాణాల్లో మిగిలిన సరుకును రాత్రికే డిపోలకు తరలించాలని అధికారులు ఆదేశించారు. దుకాణాల్లో ఇప్పటివరకూ విక్రయించిన సరుకుకు సంబంధించిన లెక్కలు తేల్చేందుకు రెవెన్యూ, ఎక్సైజ్ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బందితో 16 బృందాలను జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ నియమించారు. ఈ బృందాలు ప్రభుత్వ దుకాణాల్లో ఐదేళ్లుగా చేపట్టిన లావాదేవీలను పరిశీలించనున్నాయి.

అల్పపీడనంతో వర్షం

విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):
బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో సోమవారం అర్ధరాత్రి నుంచి నగరంలో పలుచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. మంగళవారం ఉదయం, సాయంత్రం, రాత్రి జల్లులు పడ్డాయి. మధురవాడ, ఎండాడ, భీమునిపట్నం ప్రాంతాల్లో గట్టి వర్షం పడడంతో రోడ్లు జలమయమయ్యాయి. అల్పపీడనం మంగళవారం రాత్రికి వాయుగుండంగా మారినందున బుధవారం నుంచి వర్షాలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు.



గోస్తని పరిసరాల్లో ఇసుక తవ్వకాలకు నో

- గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని అధికారుల నిర్ణయం
- అక్రమాలకు అవకాశం ఉంటుందనే నిరాకరణ
- గతంలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- చెక్‌డ్యామ్‌లు, మంచినీటి పథకాలకు ముప్పు



గోస్తనీ నది

విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):
గోస్తనీ నది పరీవాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇవ్వరాదని అధికార యంత్రాంగం నిర్ణయించింది. విశాఖ నగరానికి ఆనుకుని ఉన్న ఆనందపురం, భీమిలి మండలాలతోపాటు మధురవాడ పరిసరాల్లో ఇళ్ల నిర్మాణానికి భారీగా ఇసుక అవసరం ఉంది. అయితే జిల్లాలో పెద్ద నదులు లేకపోవడంతో ఇసుక సరిపడా లభ్యం కావడం లేదు. ప్రస్తుతం ఇటు శ్రీకాకుళం, అటు రాజమండ్రి ప్రాంతాల నుంచి ఇసుక తీసుకువస్తున్నారు. అయితే చిన్న నదులు, వాటి పరీవాహక ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు, రైతులకు చెందిన పట్టా, జిరాయితీ భూముల్లో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. జిల్లా స్థాయిలో కమిటీలకు దరఖాస్తు చేసుకోవచ్చునని ప్రకటించింది. తవ్వకాలకు సంబంధించి తాత్కాలిక పర్మిట్లు తీసుకుని నిర్ణీత ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో పారుతున్న గోస్తనీ నది పరీవాహక ప్రాంతాల్లో ఉన్న ఇసుక స్థానిక అవసరాలకు కొంత వరకూ సరిపోతుంది. గోస్తని నది పరీవాహక ప్రాంతంలో గల పద్మనాభం మండలం మద్ది, విలాస్వానిపాలెం, పద్మనాభం, పొట్నూరు, కృష్ణాపురం, రేవిడి, పాండ్రంకి, భీమిలి మండలం తాటితూరు, టి.నగరంపాలెం, మజ్జివలస, ఆనందపురం మండలం బోని గ్రామ పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల్లో ఇసుక నిల్వలు ఉన్నాయి. ప్రభుత్వ భూములతోపాటు రైతులకు చెందిన పట్టా, జిరాయితీ భూముల్లో ఇసుక ఉందని గనుల శాఖ ఇప్పటికే గుర్తించింది. అయితే గతంలో నదికి ... మిగతా 8వ పేజీలో

వాల్తేరు రైల్వేలో పక్కాగా స్వచ్ఛతా పక్వాడా



పారిశుధ్య కార్మికునికి గుడ్డ సంచులు అందజేస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 1 నుంచి 15 వరకు వాల్తేరు రైల్వేలో చేపట్టిన స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్, ఇతర అధికారులు, ఉద్యోగులు పారిశుధ్య పనులు చేపట్టారు. అనంతరం డీఆర్‌ఎం మాట్లాడుతూ డివిజన్ వ్యాప్తంగా 15 రోజులు నిర్వహించిన స్వచ్ఛతా పక్వాడాలో రైల్వే స్టేషన్లు, రైల్వే కాలనీలు, డీజిల్ లోకోషెడ్, విద్యుత్ లోకోషెడ్, కోచింగ్ కాంప్లెక్సు, కార్యనిర్వాహక కార్యాలయాల్లో పరిశుభ్రత పాటించినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ నిషేధం, మొక్కల పెంపకం ఆవశ్యకతపై వీధి నాటకాల ప్రదర్శనతో అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, సివిల్ డిఫెన్స్, వాల్తేరు మహిళా సంక్షేమ సంఘం, ఇతర స్వచ్ఛంద సంస్థలతో కలిసి అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు డీఆర్‌ఎం వివరించారు. స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాల్లో భాగంగా రైల్వే స్టేషన్లలో 550 కిలోల ప్లాస్టిక్ సంచులు, సీసాలు సేకరించి, ఎక్కడపడితే అక్కడ ఉమ్మివేసి అపరిశుభ్రతకు పాల్పడిన వారిపై 1,356 కేసులు నమోదు చేసి వారి నుంచి రూ.3 లక్షల జరిమానా వసూలు చేశామన్నారు. డివిజన్ వ్యాప్తంగా ప్రయాణికులు, పారిశుధ్య కార్మికులకు సుమారు రెండు వేల గుడ్డ సంచులను పంపిణీ చేశామన్నారు. ఏడీఆర్‌ఎంలు మనోజ్‌కుమార్ సాహు, సుధీర్‌కుమార్ గుప్తా, వాల్తేరు మహిళా సంక్షేమ సంఘం ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

దత్తత బడి.. దయనీయ స్థితి



దొండపర్తి మండావారి వీధిలో ప్రాథమిక పాఠశాల భవనం

అక్కయ్యపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దొండపర్తి మండవారి వీధిలో సీబీఎం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల భవనం దయనీయ స్థితిలో కనిపిస్తోంది. భవనాలు లోపల, బయట శిథిలావస్థకు చేరుకుని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు భీతి గొలుపుతోంది. సుమారు మూడు దశాబ్దాల కిందట నిర్మించిన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలను 2008లో రాజస్థాన్ మండల్ సభ్యులు దత్తత తీసుకుని 2020 వరకు నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత వదిలేయడంతో సరైన నిర్వహణ లేక దీనస్థితిలో ఉంది. స్లాబ్, సన్‌సైడ్ పెచ్చులూడాయి. తలుపులు, కిటికీలు విరిగిపోయాయి. నీటి సదుపాయం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాల గోడలు మరింత నానిపోయి పెచ్చులూడాయి. ఈ పాఠశాల భవనాల దుస్థితి చూసి తల్లిదండ్రులు తమ పిల్లలను ఇందులో చేర్పించడం లేదు. ఆరేళ్ల క్రితం 108 మంది విద్యార్థులు ఉండగా, ప్రస్తుతం వీరి సంఖ్య 45కి తగ్గింది. ఉపాధ్యాయులు కూడా ఇద్దరే మిగిలారు. నాడు-నేడు కార్యక్రమం కింద పాఠశాలలను మెరుగుపరుస్తున్నామని ఊదరగొట్టిన వైసీసీ ప్రభుత్వం ఈ పాఠశాల భవనాన్ని నిర్లక్ష్యంగా వదిలేసిందని తల్లిదండ్రులు విమర్శించారు. ఈ పాఠశాల భవనాల దుస్థితిపై జీవీఎంసీ కమిషనర్లకు ఉపాధ్యాయులు వినతిపత్రాలు సమర్పించినా స్పందన లేదు. జోనల్ అధికారులకు సమస్య వివరించగా రాజస్థాన్ మండల్ సభ్యుల దత్తతను రద్దు చేయిస్తే బాగు చేయిస్తామని చెప్పారన్నారు. మండల విద్యాశాఖాధికారి రామారావు ఇటీవల పాఠశాల పరిస్థితిని పరిశీలించారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, జీవీఎంసీ, విద్యాశాఖాధికారులు స్పందించి ఈ పాఠశాల భవనాన్ని కూలగొట్టి నూతన భవనాన్ని నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



విరిగిపోయిన కిటికీ



రంధ్రాలు పడిన తలుపు

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



స్వర్ణ పుష్పాలతో కనకమహాలక్ష్మి అమ్మవారు

జగదాంబ కూడలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారికి ఆలయ అధికారులు మంగళవారం అష్టదళ పద్మారాధన సేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌ను స్వర్ణకవచాలతో అలంకరించి, 108 స్వర్ణ పుష్పాలతో పూజలు జరిపారు. ఈ పూజల్లో పాల్గొనదలచిన భక్తులు రూ.1,116 చెల్లించాలని ఈవో కె.శోభారాణి తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారి దర్శనాలకు భక్తులు బారులు తీరారు.

సెయింట్ జోసెఫ్‌లో నేడు, రేపు పీజీ స్పాట్ అడ్మిషన్లు

జ్ఞానాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురంలోని సెయింట్‌జోసెఫ్ మహిళా కళాశాలలో పీజీ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి బుధ, గురువారాల్లో (16, 17 తేదీలు) స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సిస్టర్ డా.షైజీ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ వివరాలను కళాశాల కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు. ఏపీసెట్, ఏజీసెట్లు రాసినా, రాయకపోయినా ప్రవేశానికి అర్హులేనన్నారు. ఎం.ఎ ఇంగ్లీషు, ఎమ్మెస్సీ మేథమెటిక్స్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, సైకాలజీ, హోమ్ సైన్స్‌లో ఖాళీలు ఉన్నాయన్నారు.

దివ్యాంగులకు అవగాహన



ర్యాలీలో పాల్గొన్న బాలలు, ఉపాధ్యాయులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రం ఎదుట దివ్యాంగు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈవోలు రామారావు, బాలామణి మాట్లాడుతూ లేఖన వైకల్యం, ఏకాగ్రత లోపం, భాషణ వైకల్యం, గణిత పరిమేణ వైకల్యం కలిగిన పిల్లలను గుర్తించి వారిని సాధారణ పిల్లలతో కలిపి చిన్న చిన్న టిప్స్‌తో విద్యను ఎలా అందించాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.లక్ష్మీ నరస, భవిత కేంద్రం ఉపాధ్యాయిని జగదాంబ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తిరుమలలో నృత్య రూపకం



ప్రదరన ఇచ్చిన విశాఖ నృత్య విద్యార్థినులు

సీతంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల కొండపై ఇటీవల నిర్వహించిన సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో హనుమంత వాహనం ముందు విశాఖ నగరానికి చెందిన నృత్య భారతి డాన్స్ అకాడమీ బృందం నృత్యరూపకాన్ని ప్రదర్శించింది. తన సారథ్యంలో 30 మంది విద్యార్థినుల బృందం శ్రీకృష్ణ లీలలు నృత్య రూపకం ప్రదర్శించినట్లు నృత్య దర్శకురాలు వి.మౌనిక పట్నాయక్ తెలిపారు. ఈ అవకాశం వెంకటేశ్వరస్వామి ఇచ్చిన అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. చక్కని అవకాశం ఇచ్చిన తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులకు, అన్నమయ్య సేవా ట్రస్ట్ వారికి నృత్య కళాకారులు ధన్యవాదాలు తెలిపారు.

ఊరొదిలి వచ్చేసిన మహిళ అప్పగింత



రంగిలిసింగి గ్రామ పెద్దలతో మహి

అక్కయ్యపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహంలో ఆశ్రయం పొందుతున్న ముంచింగిపుట్టు మండలం రంగిలిసింగికి చెందిన ఆదివాసీ మహిళ కె.మహి (24)ని ఆ గ్రామ సర్పంచి, ఆదివాసీ నాయకుడు పాంగి పాండుకు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. ఆమె పాడేరు నుంచి వైజాగ్ వచ్చి రైల్వేస్టేషన్‌లో దిక్కుతోచని స్థితిలో ఉండడంతో ఏయూటీడీ సిబ్బంది ఆరా తీసి టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతిగృహంలో ఆశ్రయం కల్పించినట్లు చెప్పారు. రెండుసార్లు వసతి గృహం నుంచి మహి పారిపోయిందని, రెండో పట్టణ పోలీసులు తీసుకొచ్చి తమ సిబ్బందికి అప్పజెప్పారని పేర్కొన్నారు. పాడేరులో పనిచేస్తున్న ఆదివాసి మిత్ర సంస్థ డైరెక్టర్ మన్మధరావును ఒడియాలో ఆమెతో మాట్లాడించి పూర్తి వివరాలు తెలుసుకున్నామన్నారు. భర్త వేరే వివాహం చేసుకోవడంతో గొడవ పడి అయిదేళ్ల కుమార్తెను తల్లిదండ్రుల వద్ద వదిలేసి వైజాగ్ వచ్చిందని తెలిపారు. చివరికి తాము మహిని కారులో పాడేరు తీసుకెళ్లి ఆ గ్రామ నాయకులకు అప్పగించామన్నారు.

రత్నకుమారికి డాక్టరేట్



ఉత్తర్వులు అందుకుంటున్న మాటూరు రత్నకుమారి

అక్కయ్యపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగ పరిశోధకురాలు మాటూరి రత్నకుమారికి ఏయూ డాక్టరేట్ లభించింది. ఏయూ విభాగాచార్యులు, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ పర్యవేక్షణలో 'ఈ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ప్రాక్టీసెస్ ఇన్ పబ్లిక్ సెక్టార్ ఏ స్టడీ ఆన్ సెలెక్ట్ పబ్లిక్ సెక్టార్ ఆర్గనైజేషన్స్ ఇన్ విశాఖపట్నం' అనే అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా డాక్టరేట్ ఉత్తర్వులను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్. ధనుంజయరావు నుంచి స్వీకరించారు. రత్నకుమారి ప్రస్తుతం ఎన్ఎస్‌టీఎల్‌లో ప్రిన్సిపల్ ప్రైవేట్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి.కృష్ణమోహన్, డాక్టర్ జాలాది రవి తదితరులు పాల్గొన్నారు.

సారూ... మా ఇబ్బందులు తొలగించరూ!

▸▸ 37వ వార్డులో పర్యటించిన ఎమ్మెల్యేకు సమస్యలపై ఏకరవుపెట్టిన స్థానికులు



ఎమ్మెల్యే వంశీకృష్ణకు సమస్యలు చెబుతున్న స్థానికులు

జగదాంబ కూడలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అపారిశుధ్యం, తాగునీరు, అస్తవ్యస్త రహదారులు వంటి సమస్యలతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ వద్ద స్థానికులు ఏకరవు పెట్టారు. 37వ వార్డులో మంగళవారం పర్యటించిన ఎమ్మెల్యేను కలిసి తమకు తక్షణమే కనీస వసతులు కల్పించాలని వేడుకున్నారు. జీవీఎంసీ జోనల్ కమిషనర్ మల్లయ్యానాయుడు, ఇతర అధికారులతో కలసి పర్యటించిన ఎమ్మెల్యే దృష్టికి వైసీపీ పాలనలో తమ వార్డులో సమస్యలను కార్పొరేటర్ పట్టించుకోలేదని ఆరోపించారు. భవానీకాలనీలో భారీగా పెరిగిన వృక్షం తొలగించాలని, కొత్త అగ్రహారంకాలనీలో కొత్తమ్మ, పోలేరమ్మ గుడి నిర్మాణం పూర్తిచేయాలని విన్నవించారు. వీధుల్లో కాలువలపై పలకలు లేక ఇబ్బంది పడుతున్నామని, మంచినీటి సరఫరా సమయం పెంచాలని మహిళలు విన్నవించారు. పెయిన్‌దొర పేట వద్ద సామాజిక భవనానికి విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయాలని, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. గొల్లవీధి ప్రాంతంలో పురాతన భవనం కూలే స్థితిలో ఉన్నందున, ప్రమాదం నుంచి కాపాడాలని ఆయనను కోరారు. ఆంజనేయస్వామి గుడికి గేట్లు, గోడారి వీధిలో స్పీడ్ బ్రేకర్లు కావాలన్నారు. చేపల మార్కెట్ ఆధునికీకరణ చేయాలంటూ వ్యాపారులు విన్నవించారు. పలు వార్డుల్లో పారిశుధ్యం పేరుకుపోవడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యే వంశీకృష్ణ శానిటేషన్ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వార్డులో కూటమి నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్ విస్తృత తనిఖీలు

▸▸ పఠనా సామర్థ్యాల పరిశీలన

▸▸ ఆసుపత్రిలో వైద్య సేవలపై ఆరా



అంగన్వాడి కేంద్రంలోని చిన్నారులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

సీతమ్మధార, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ హితవు పలికారు. సీతమ్మధార పీఅండ్ టీ కాలనీలోని ఎన్‌ఎంసీహెచ్ పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. వారి చదువు, ఆంగ్లంలో మాట్లాడిన తీరు, గణితంలో చూపిన ప్రతిభను అంచనా వేసి, పఠనా సామర్థ్యాన్ని చూసి అభినందించారు. విద్యార్థులతో కొన్ని పాఠ్యాంశాలను చదివించి కొన్ని ప్రశ్నలకు సమాధానం అడిగారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రమశిక్షణతో మెలగడం, బాధ్యతగా నడుచుకోవడం, ప్రణాళికబద్ధంగా చదువుకోవడం విద్యార్థులు అలవరుచుకోవాలని సూచించారు. ఆంగ్లం, హిందీపై పట్టు సాధించాలని సూచించారు. పదో తరగతి తర్వాత ఎదుర్కొనే పోటీ పరీక్షల్లో సత్తా చాటాలని హితవు పలికారు. విద్యార్థుల ఆసక్తిని గమనించి పఠనా సామర్థ్యాలు మరింత పెంచాలని, చదివిన అంశాలు సులభంగా అర్థం చేసుకునేలా, దీర్ఘకాలం గుర్తుంచుకునేలా మెలకువలు నేర్పించాలని ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం అదే పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. అక్కడ తయారు చేసిన ఆహారాన్ని రుచి చూశారు. ఈ క్రమంలో భోజనం తయారు, సరకుల వినియోగం, ఇతర అంశాలపై నిర్వాహకులతో మాట్లాడారు. జిల్లా విద్యాశాఖ అధికారిణి ఎల్.చంద్రకళ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా పౌష్టికాహారం ఇవ్వాలి

గర్భిణులు, చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ అధికారులను, సిబ్బందిని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. గ్రేటర్ విశాఖ 24వ వార్డు రేసపువానిపాలెంలోని అంగన్వాడీ కేంద్రాన్ని మంగళవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారుల హాజరు శాతాన్ని, సరకుల నిల్వను పరిశీలించారు. పిల్లల హాజరు పట్టికను పరిశీలించారు. వారితో ముచ్చటించి సరదాగా గడిపారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. నెలవారీ సరకులు, టీహెచ్‌ఆర్, కేంద్రానికి వస్తున్న చిన్నారులకు అందిస్తున్న ఆహారం తదితర అంశాలపై ఆరా తీశారు. లోపాలు తలెత్తకుండా సరకులు అందజేయాలని ఆదేశించారు.

సకాలంలో వైద్యసేవలందించండి

ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలందించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. పాత రేసపువానిపాలెం పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (యూపీహెచ్‌సీ) మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పరిస్థితులను గమనించారు. ఓపీ సంఖ్య అందుబాటులో ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యం కోసం వచ్చిన వారితో మాట్లాడుతూ వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న ఉద్యోగుల హాజరు పుస్తకాన్ని, ఇతర రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



నెహ్రూబజార్ మలుపులో చెత్త కుప్ప

హెచ్చరిక బేఖాతరు!

సీతంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరాన్ని శుభ్రంగా ఉంచాలని, చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకుండా అందరూ బాధ్యతగా వ్యవహరించాలని జీవీఎంసీ అన్ని వీధుల్లో ప్రచారం చేయిస్తోంది. అలాగే చెత్త నిల్వ లేకుండా చూడాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించింది. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎక్కడికక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసింది. అయితే వీటిని బేఖాతరు చేస్తున్నట్లుగా ద్వారకానగర్‌లోని నెహ్రూబజార్ మలుపులో ఇదిగో..ఇలా బోర్డు వద్దనే స్థానికులు చెత్తకుప్పగా మార్చేశారు. పారిశుధ్య సిబ్బంది కూడా పట్టించుకోలేదు. చినుకులు పడితే దుర్గంధం వెదజల్లుతోంది. ప్రజలు ముక్కుమూసుకుని వెళ్తున్న తీరును ఆంధ్రజ్యోతి మంగళవారం గమనించింది. చెత్త వేస్తే రూ.1000 జరిమానా అని బోర్డు పెట్టినా స్థానికులు విచక్షణ కోల్పోయి మరీ చెత్త వేశారు.

ఏఆర్ కానిస్టేబుల్ మిస్సింగ్‌పై ఫిర్యాదు



గేదెల సంజీవ నాయుడు (ఫైల్ ఫొటో)

కంచరపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన ఏఆర్ కానిస్టేబుల్ తిరిగి చేరకపోవడంతో కంచరపాలెం పోలీసు స్టేషన్‌లో అతని భార్య ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక పట్టాభిరెడ్డి తోట విఘ్నేశ్వర అపార్టుమెంటులో నివసిస్తున్న గేదెల సంజీవ నాయుడు (32) నగరంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. విజయవాడలో ప్రత్యేక విధులు ముగించుకుని సంజీవ నాయుడు ఈ నెల 11న ఇంటికి చేరుకున్నారు. అదే రోజు ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో అతని భార్య సాయిశ్రీ సమీప బంధువుల ఇళ్ల దగ్గర వాకబు చేసింది. భర్త ఆచూకీ తెలియకపోవడంతో కంచరపాలెం పోలీసులకు ఈ నెల 13న ఫిర్యాదు చేసింది. సీఐ చంద్రశేఖర్ పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ నరసింహమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ టోర్నీకి విశాఖ జట్టు



బాల క్రీడాకారులతో డీఎస్‌డీవో జూన్ గ్యాలియట్, కోచ్ మునేవర్

విశాఖపట్నం (స్పోర్ట్సు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే విశాఖ జట్టును మంగళవారం ప్రకటించారు. గుంటూరులో ఈ నెల 17, 18 తేదీల్లో జరిగే ఈ టోర్నీలో విశాఖ నుంచి 26 మంది జిమ్నాస్టులు పాల్గొంటారు. ఈ సందర్భంగా పాండురంగపురంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఇండోర్ స్పోర్ట్సు హాల్‌లో జరిగిన కార్యక్రమానికి డీఎస్‌డీవో జూన్ గ్యాలియట్ హాజరై రాష్ట్ర స్థాయి టోర్నీలో విశాఖ నుంచి ఏడేళ్ల చిన్నారుల నుంచి 17 ఏళ్ల బాలురు వరకు పాల్గొనడం విశేషమని పేర్కొన్నారు. కోచ్ మునేవర్ వద్ద శిక్షణ పొందిన ఈ జట్టు రాష్ట్ర స్థాయి టోర్నీలో పతకాలు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

విశాఖ జట్టు: బాలికల అండర్ 7-8 ఏళ్ల విభాగంలో ఆశ్వి సోని, సఫూర ఫర్హానా, కె.హేమ జోత్స్న; 9-10 ఏళ్ల విభాగంలో షమయా జార్జ్, ఆనంది, రియాంశినాథ్; 11-12 ఏళ్ల కేటగిరిలో కె.కీర్తి, కె.హారిక, ఆయతి పిల్లాయ్; రిథమిక్ ఈవెంట్‌లో కె.నాగ నందన, కె.సాహితి రత్న, సంజన సరయు, ఎస్.కృతి; బాలుర 7-8 ఏళ్ల విభాగంలో చార్విక్ శ్రీరామ్, కె.యోషిత్, ప్రణవ్; 9-10 మధ్య రాహుల్ రెడ్డి, వీర హనుమాన్, కె.జశ్వంత్; 11-12 ఏళ్ల విభాగంలో విశ్విత్ జాయ్, అభిరామ్, ఎం.ధనుష్; 13-14 ఏళ్ల విభాగంలో ఎం.కృతిక్, ఎస్.రాఘవేంద్ర, పి.లక్ష్మీనారాయణ; 17 ఏళ్ల విభాగంలో ఎస్‌కె.సల్మాన్ ఆరిఫ్ ప్రాతినిధ్యం వహిస్తారు.

నేటి నుంచి న్యూరో వైద్యుల జాతీయ సదస్సు

విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా బుధవారం నుంచి 20వ తేదీ వరకూ న్యూరాలజీ వైద్యుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు సదస్సు ఛైర్మన్, ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు పేర్కొన్నారు. కేజీహెచ్‌లోని సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో గల అంకాలజీ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన సదస్సు వివరాలను వెల్లడించారు. దేశ, విదేశాల నుంచి వైద్య నిపుణులు పాల్గొని అధునాతన వైద్య విధానాలు, కొత్తగా వస్తున్న న్యూరో సంబంధిత సమస్యలపై ప్రసంగిస్తారన్నారు. సుమారు రెండు వేల మంది న్యూరాలజీ వైద్య నిపుణులు ఈ సదస్సులో పాల్గొంటారని వెల్లడించారు. ప్రముఖ వైద్యులకు సంబంధించిన నాలుగు స్మారక ప్రసంగాలు ఉంటాయన్నారు. ఈ సదస్సుకు ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు, డీఎంఈ డాక్టర్ డీవీఎల్ నరసింహం హాజరవుతున్నారన్నారు. సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ, కేజీహెచ్ న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.గోపి మాట్లాడుతూ ఈ సదస్సులో మూర్ఛ వ్యాధి, స్ట్రోక్ సమస్యలపై చర్చిస్తామన్నారు. ఈ నెల 20వ తేదీ ఉదయం ఆరు గంటలకు రన్ ఫర్ బ్రెయిన్ అనే థీమ్‌తో ప్రత్యేకంగా వాక్ నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

విద్యార్థులకు ప్రయాణ 'పరీక్ష'



బస్సుల కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు

కంచరపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం జాతీయ రహదారి ఊర్వశి జంక్షన్ బస్టాప్ వద్ద నిత్యం విద్యార్థులకు ప్రయాణ అవస్థలు తప్పడం లేదు. ఇక్కడ జాతీయరహదారికి సమీపంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, ఐటీఐ, వివిధ ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. నిత్యం వందలాది మంది విద్యార్థులు ఇక్కడకు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఊర్వశి జంక్షన్ వద్ద బస్సు షెల్టర్ ఒక దగ్గర, బస్టాప్ మరోచోట ఉండడంతో బస్సు వచ్చిన వెంటనే పరుగులు పెడుతున్నారు. బస్సులు హైవేలో ఆగడం, బస్ షెల్టర్, స్టాపు దూరంగా ఉండడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. చాలా మంది షెల్టర్‌లో కూర్చోలేక బస్సుల కోసం హైవే ఫుట్‌పాత్‌పైనే నిరీక్షిస్తుంటారు. దీనిపై పలువురు విద్యార్థులు, ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు దృష్టి సారించి తమ అవస్థలు తప్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.



బొర్రమాంబకు ప్రత్యేక పూజలు

అగనంపూడి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి ఉక్కు నిర్వాసిత ప్రాంతాల ఆరాధ్య దేవత బొర్రమాంబ ఆలయంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అమ్మవారిని పుష్పాలతో అలంకరించి పూజలు చేయగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు లలిత, విష్ణుసహస్రనామ పారాయణాలను పఠించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేశ్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు, తదితరులు పాల్గొన్నారు.

విశాఖకు రేపు నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం

విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం ఈ నెల 17, 18 తేదీల్లో విశాఖ జిల్లా పర్యటనకు రానున్నారు. నగరంలో ఆయన పర్యటనకు సంబంధించిన వివరాలను అధికారులు ఆ రోజే వెల్లడించనున్నారు.

నేడు కూటమి నాయకుల ఆత్మీయ సమావేశం

గాజువాక, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి పార్టీల గాజువాక నియోజకవర్గ నాయకుల ఆత్మీయ సమావేశం బుధవారం 88వ వార్డు పరిధి గ్రీన్ సిటీలో జరగనున్నట్టు టీడీపీ 'గాజువాక' సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరు కానున్న ఈ సమావేశానికి కూటమి పార్టీల కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

కామర్స్ మేనేజ్‌మెంట్‌లో రత్నకుమారికి డాక్టరేట్



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న రత్నకుమారి

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగ పరిశోధకురాలు మాటూరి రత్నకుమారికి డాక్టరేట్ లభించింది. ఏయూ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ పర్యవేక్షణలో ఈ-హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ప్రాక్టిసెస్ ఇన్ పబ్లిక్ సెక్టార్, పబ్లిక్ సెక్టార్ ఆర్గనైజేషన్ ఇన్ విశాఖపట్నం అనే అంశంపై చేసిన పరిశోధనలకు గాను ఆమెకు డాక్టరేట్ లభించింది. ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు చేతుల మీదగా మంగళవారం ఏయూలో రత్నకుమారి డాక్టరేట్ అందుకున్నారు.

సినిమా గైడ్

● **వేట్టయాన్ :** సంగం, రమాదేవి, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, లక్ష్మి (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాత (తగరపువలస)

● **విశ్వం :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **జనక అయితే గనక :** శారద, కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)

● **మా నాన్న సూపర్‌హీరో :** గోకుల్, మౌర్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)

● **శ్వాగ్ :** శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)

● **దేవర :** మెలోడి, జగదాంబ, శరత్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 49, టమాటా 50, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 54, బెండకాయలు 36, పచ్చిమిర్చి 60, కాకరకాయలు 36, బీరకాయలు 40, ఆనపకాయ 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజ్ 26, క్యారెట్ 50 దొండకాయలు 40, బంగాళదుంపలు 30, అరటికాయ (పెద్దది) 8, మునక్కాడలు (కిలో) 82, అల్లం (పాతది) 100, బరబాటి 44, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 85, గోరుచిక్కుడు 30, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 26, బీన్స్ (పెన్సిల్) 110, పొటల్స్ 60, కీరదోస 32, క్యాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 32, కంద 62, దేముడు చిక్కుడు 70, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్యాబేజి... క్యాప్సి... కర్రపెండలం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	120
ఫారం ధర	149
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

మండల సర్వేయర్ కావలెను!

» నెల రోజులుగా ఖాళీగా ఉన్న పోస్టు
» సర్వే పనులు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పెందుర్తి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ కార్యాలయ పరిధిలోని భూముల కొలతలు, హద్దులను నిర్ణయించడంలో మండల రెవెన్యూ సర్వేయర్ పాత్ర ఎంతో కీలకం. ప్రభుత్వ భూములఎఫ్‌ఎంబీ స్కెచ్, ఆర్వీఎం మ్యాపింగ్ ఆధారంగా ప్రభుత్వ భూముల ఆక్రమణలను నిర్ధారించాల్సి ఉంటుంది. అంత ముఖ్యమైన మండల రెవెన్యూ సర్వేయర్ పోస్టును భర్తీ చేయకపోవడంతో పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో సర్వే పనుల కోసం ప్రజలు ఆగాల్సి వస్తోంది. ఇక్కడ పనిచేసిన సర్వేయర్ నెల రోజుల క్రితం బదిలీపై వెళ్లిపోయారు. ఆయన స్థానంలో మన్యం జిల్లాకు చెందిన ఓ వ్యక్తికి సర్వేయర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఆయన ఇప్పటివరకు ఇక్కడ బాధ్యతలు చేపట్టలేదు. ఆయనపై ఏసీబీ కేసు ఉన్నందున పోస్టింగ్ ఆగినట్టు తెలిసింది. దీంతో మండల సర్వేయర్ లేక రెవెన్యూలోని కీలక దస్త్రాలు కదలిక లేక పేరుకుపోతున్నాయి. మండల రెవెన్యూ పరిధిలో గల భూ సంబంధిత వ్యవహారాలన్నింటినీ సర్వేయర్ చక్కదిద్దాల్సి ఉంటుంది. ఈ క్రమంలో మండల సర్వేయర్ ఒకరు మాత్రమే ఉండడంతో పనులు త్వరితంగా తేలడం లేదు. స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి ఇద్దరు సర్వేయర్లు అవసరమని గతంలోనే ప్రతిపాదించినప్పటికీ అది ఇప్పటికీ కార్యరూపం దాల్చడం లేదు. ప్రస్తుతం నెల రోజులుగా సర్వేయర్ లేకపోవడంతో మండల వాసులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. సర్వేయర్ లేక విలువైన స్థలాలు, పరిరక్షణ, భూ వివాదాలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఇదిలా ఉండగా పెందుర్తి మండల సర్వేయర్ పోస్టుకు ఆదాయ మార్గాలు బాగానే ఉంటుందన్న సమాచారంతో అధికార పార్టీ నాయకుల సిఫార్సులు తప్పనిసరి అని, ఈ పోస్టుకు రూ.లక్షల్లో గిరాకీ ఉంటుందని రెవెన్యూ వర్గాల్లో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అందువల్లే సర్వేయర్ పోస్టు భర్తీకి నోచుకోవడం లేదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.



తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న మండల సర్వేయర్ రూమ్

స్టీల్‌ప్లాంట్ కార్మిక సమ్మెపై భిన్నాభిప్రాయాలు

» సమ్మెలో పాల్గొనబోమని పేర్కొన్న కొన్ని కార్మిక సంఘాలు
» ఇలాగైతే 'ఉక్కు' భవిష్యత్తుకు ప్రమాదమంటున్న మరికొన్ని సంఘాల నాయకులు



ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, కార్మిక సంక్షేమంపై ఈ నెల 28న సమ్మె చేస్తామని ఉక్కు యాజమాన్యానికి కార్మిక సంఘాలు ఇచ్చిన నోటీసుపై కార్మిక వర్గంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జాతీయ ఎన్‌జేసీఎస్ (నేషనల్ జాయింట్ కౌన్సిల్ ఫర్ స్టీల్) కార్మిక సంఘాలు మాత్రమే సమ్మె నోటీసు ఇచ్చాయని, కొన్ని కార్మిక సంఘాలతో సంప్రదింపులు చేయలేదని పలు సంఘాలకు చెందిన కార్మిక నాయకులు పేర్కొంటున్నారు. స్టీల్‌ప్లాంటులో ఎన్నో సమస్యలు ఉన్నాయని, ముఖ్యంగా ప్రైవేటీకరణ పిడుగు ప్లాంట్ నెత్తిపై ఉందని, ఈ క్రమంలో సమ్మె చేస్తామని యాజమాన్యానికి కొన్ని కార్మిక సంఘాలు మాత్రమే నోటీసు ఇవ్వడంపై నాయకులు మండిపడుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్లాంటులో ఉన్న అన్ని కార్మిక సంఘాలతో ప్రధాన కార్మిక సంఘాలు కలిసి పోరాటాలు చేయడం లేదని, ఎవరికి నచ్చినట్టు వారు వ్యవహరిస్తున్నారని, ఇది ప్లాంట్ భవిష్యత్తుకు తీవ్ర ప్రమాదమని కొన్ని సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉక్కు కర్మాగారం భవిష్యత్తు కోసం యోచించే ముందు అన్ని వర్గాల మద్దతు తీసుకోవాల్సి ఉండగా, ఇప్పుడు కేవలం తమ పబ్బం గడుపుకునేందుకు మాత్రమే ప్రధాన కార్మిక సంఘాలు వ్యవహరిస్తున్నాయని పలువురు కార్మికులు ఆరోపిస్తున్నారు. ఇదిగా ఉండగా ఈ నెల 28న సమ్మెలో పాల్గొనేది లేదని కొన్ని నాన్ ఎన్‌జేసీఎస్ సంఘాల నాయకులు పేర్కొన్నారు.



టీడీపీ కార్యాలయంలో అబ్దుల్ కలామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రసాదుల శ్రీనివాసరావు, తదితరులు



70వ వార్డులో అబ్దుల్ కలామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

యువతకు ఆదర్శం అబ్దుల్ కలామ్ జీవితం

టీడీపీ 'గాజువాక' సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు

గాజువాక, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త అబ్దుల్ కలామ్ జీవితం నేటి యువతకు ఆదర్శనీయమని తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో అబ్దుల్ కలామ్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచం గర్వించదగ్గ శాస్త్రవేత్తల్లో అబ్దుల్ కలామ్ ఒకరని అన్నారు. గతంలో ఒకసారి కలామ్ గాజువాక ప్రాంతానికి విచ్చేశారని పేర్కొన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులను తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందని ప్రసాదుల శ్రీనివాసరావు అన్నారు. నిరాడంబరమైన జీవనాన్ని గడిపిన కలామ్ సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత గాజువాక అధ్యక్షుడు బలగ బాలు నాయుడు, నాయకులు శివప్రసాదరావు, నాగేశ్వరరావు, గాంధీ, రాజారావు, మాధవరావు, చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్: మహనీయుల జీవితాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చేసాపీకే యుటిలిటీస్ కార్పొరేషన్ (అమెరికా) ఎంటర్‌ప్రైజెస్ అప్లికేషన్స్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ పురోగామి అన్నారు. 70వ వార్డు శ్రీనివాసనగర్ ట్వింకిల్ స్కూల్ అబ్దుల్ కలామ్ జయంతిని, డాక్టర్ రతన్ టాటా సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కలామ్ విగ్రహానికి, రతన్ టాటా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పురోగామి మాట్లాడుతూ ఆశయం గొప్పదైతే ఆచరణ సాధ్యమవుతుందన్నారు. రైజ్ ఆస్పత్రి ఎండీ హరి వెంకటేశ్, చిత్రలేఖాదేవిలు మాట్లాడుతూ విద్యార్థులు ఆధునికతతో కూడిన నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. మహనీయుల జీవిత చరిత్రలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ దొడ్డి శ్యామ్, ప్రిన్సిపాల్ కరుణకుమారి, ఉపాధ్యాయులు గీత, శిరీష, లలిత, తదితరులు పాల్గొన్నారు.

'గాజువాకలో 20 వేల బీజేపీ సభ్యత్వాలు'

గాజువాక, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గాజువాక నియోజకవర్గంలో ఇప్పటి వరకు 20 వేల మంది వరకు భారతీయ జనతా పార్టీ సభ్యత్వం తీసుకున్నారని కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. గాజువాక హైస్కూల్ రోడ్డులో మంగళవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం పట్ల ప్రజలు ఎంతో సానుకూలంగా ఉన్నారని, అందువల్లే పార్టీ సభ్యత్వాన్ని తీసుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారన్నారు. పీఎం మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధిలో పరుగులు తీస్తుందన్నారు. నాయకులు యల్లాజీరావు, విజయ, లావణ్య, రామలక్ష్మి, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేస్తున్న కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు

'కోరమాండల్' సేవలు ప్రశంసనీయం: ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కోరమాండల్ అంతర్జాతీయ ఎరువుల కర్మాగారం యాజమాన్యం సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా చేపడుతున్న సేవలు ఎంతో ప్రశంసనీయమైనవని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాలని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) అన్నారు. శ్రీహరిపురం జీవీఎంసీ పాఠశాల ప్రాంగణంలో కోరమాండల్ సౌజన్యంతో రూ.36 లక్షలతో నిర్మించిన అదనపు భవనం, సైన్స్ ప్రయోగశాలను మంగళవారం ఉదయం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 'కోరమాండల్' ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టిందని, ఇప్పుడు విద్యా సంస్థ కోసం అందించిన సేవలు విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని పేర్కొన్నారు. సైన్స్ ల్యాబ్‌ను విద్యార్థులందరూ ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం గణబాబును కోరమాండల్ కర్మాగారానికి చెందిన అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో 'కోరమాండల్' వైస్ ప్రెసిడెంట్ (యూనిట్ హెడ్) జ్ఞానసుందరం, డీజీఎం (హెచ్ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు, సీఎస్ఆర్ ప్రతినిధి సి.జయగోపాల్, డిప్యూటీ మేనేజర్ వెంకటరమణ, శ్రీకాంత్, శర్మ, డీఈవో ఎల్.చంద్రకళ, మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, ఏపీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ అంగ దుర్గాప్రశాంతి, హెచ్ఎం పద్మ, తదితరులు పాల్గొన్నారు.



గణబాబును సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న 'కోరమాండల్' అధికారులు



సభలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేష్

పారిశ్రామిక క్లస్టర్‌గా సబ్బవరం

» జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తా: అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్

సబ్బవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సబ్బవరం మండలాన్ని పారిశ్రామిక క్లస్టర్‌గా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, అనకాపల్లి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎంపీ సీఎం రమేశ్ పేర్కొన్నారు. మండలంలోని గొటివాడలో మంగళవారం జరిగిన పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ ప్రసంగిస్తూ.. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం 10 వేల నుంచి 12 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి 30 వేల కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు వేసిందని, తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన నిధులను పక్కదారి పట్టించిందని ఆరోపించారు. రానున్న ఐదేళ్లలో రూ.50 వేల కోట్లతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. కలుషిత తాగునీటి కారణంగా పలు రకాల వ్యాధులబారిన పడుతున్నారని, ఈ సమస్యను తొలగించేందుకు ఎంపీ నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయిస్తానన్నారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ, పీఎం చంద్రబాబు పరి పాలన అనుభవం, విజన్ రాష్ట్రాభివృద్ధికి ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జీ, వైస్ఎంపీపీ ఝాన్సీలక్ష్మీరాణి, స్థానిక సర్పంచ్ సాలాపు మీన, ఇతర పంచాయతీల సర్పంచులు దాడి లావణ్య, ఆకుల శ్రీహేమ, మామిడి శంకరరావు, ఎంపీటీసీ బొండా శేషు కుమారి, కూటమి నేతలు భరణికాన బాబూరావు, గొర్లి రామునాయుడు, కర్రి కనకరాజు, మహాలక్ష్మీ నాయుడు, ఇందలి వెంకటరమణ, బీపీ రావు, సాలాపు వెంకటేశ్వర రావు, దొడ్డి ప్రకాశ్, బోకం స్వామినాయుడు, చైతన్య, రొంగలి దేముడు, ఎంపీడీవో పద్మజ, తహసీల్దార్ చిన్నికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల కోసం స్థలాలు పరిశీలన

ఎన్.ఎ.డి.జంక్షన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు పరిధిలోని కరాస శ్మశానవాటికలో కొత్తగా చేపట్టనున్న అభివృద్ధి పనుల కోసం స్థలాలను అధికారులతో కలిసి మంగళవారం డిప్యూటీ మేయర్ శ్రీధర్ పరిశీలించారు. ఈ శ్మశానవాటికలో సుమారు రెండు కోట్ల రూపాయలతో నూతనంగా షెడ్లు, వెయిటింగ్ రూమ్, సెక్యూరిటీ రూమ్, కర్రలు పెట్టుకునేందుకు స్టోర్ రూమ్, వాష్ రూమ్ తదితర నిర్మాణాలకు సబంధించి స్థలాలను తిలకించారు. శ్మశానవాటికను ఆధునిక వసతులతో అత్యాధునికంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా హిందూ, ముస్లిం, క్రైస్తవ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలను, వారి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ ఏఈ ఉషారాణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, శానిటరి ఇన్‌స్పెక్టర్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనగర్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న భవిత కేంద్రం సిబ్బంది, విద్యార్థులు

డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీలు

గోపాలపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో డిస్లెక్సియా వారోత్సవాలను సోమవారం నుంచి నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం డిస్లెక్సియా వ్యాధిపై అవగాహన ర్యాలీని భవిత కేంద్రం సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఎం.మోహనరావు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు పాఠనం, పాఠ్యాంశాల అభ్యాసంతో పాటు వివిధ కృత్యాలను ఎంచుకుని విద్యార్థులు సామర్థ్యాలను సాధించే విధంగా తమ కేంద్రంలో పలు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వారోత్సవాల సందర్భంగా ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీతో పాటు డిస్లెక్సియాపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు పి.మురళి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరిపురంలో ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే

మల్కాపురం: డిస్లెక్సియా వ్యాధితో బాధపడుతున్న విద్యార్థులతో శ్రీహరిపురం జీవీఎంసీ పాఠశాల నుంచి కొంత దూరం వరకు ర్యాలీ నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ఈ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. డిస్లెక్సియా బారినపడిన చిన్నారులు పదాలను పలకడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థి దశలోనే నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై అవగాహన కల్పించాలని, పిల్లల పురోభివృద్ధిని పెంచాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ గీత, ఏపీవో అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అమృతరావు స్ఫూర్తితో 'ఉక్కు'ను కాపాడుకుంటాం

పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ

కూర్మన్నపాలెం, అక్టోబరు 15: దివంగత తమణంపల్లి అమృతరావు స్ఫూర్తితో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుంటామని పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1,342వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా దీక్షా శిబిరంలో అమృతరావు సంతాప సభను నిర్వహించి, ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆదినారాయణ మాట్లాడుతూ ఉక్కు ఉద్యమ త్యాగానికి నేటికి 59 ఏళ్లు అయ్యాయన్నారు. అమృతరావు ఆశయ సాధన కోసం అందరం కృషి చేస్తామన్నారు. ఉక్కు పరిరక్షణకు చేపట్టిన ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలన్నారు. ఆందోళన కార్యక్రమాల్లో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, నరేంద్ర, మధు, సుదర్శన్, ప్రభాకర్, కామేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



అమృతరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పాఠశాలను పరిశీలించిన కార్పొరేటర్

అగనంపూడి అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులకు ఉత్తమ బోధనను అందించడంతో పాటు స్కూల్ అభివృద్ధికి ఉపాధ్యాయులంతా కృషి చేయాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ సూచించారు. వార్డు పరిధిలోని దేశపాత్రునిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను తిలకించడంతో పాటు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం నాణ్యతను పెంచాలని సిబ్బందికి ఆదేశించారు. పాఠశాలలోని సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవడంతో పాటు వాటి పరిష్కారానికి చొరవ చూపుతానని హామీ ఇచ్చారు.

ధరలు తగ్గించాలంటూ సీపీఐ ఆందోళన

గాజువాక, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోజురోజుకు పెరిగిపోతున్న నిత్యావసర సరకుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు మంగళవారం గాజువాక మార్కెట్ వద్ద ఆందోళన చేపట్టి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు తగ్గించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. నానాటికీ పెరుగుతున్న ధరల వల్ల సామాన్య మానవుల జీవనం ఇబ్బందికరంగా మారిందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రైతుబజార్లలో అమ్మకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, నాయకులు పోలయ్య, అచ్యుతరావు, విష్ణు, వనజాక్షి, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో పారిశ్రామిక ప్రాంతంలో చేపట్టిన ర్యాలీలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ 'పశ్చిమ' సమన్వయకర్త కాండ్రేగుల సత్యాంజనేయ మాట్లాడుతూ నిత్యావసర సరకుల ధరలను అదుపు చేసేందుకు ప్రభుత్వాలు చొరవ చూపకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గుడాల రాంబాబు, సత్యానందం, ఎన్.సూరిబాబు, పోతిన రాము, ఎన్వీ నాథ్, కామేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, బి.వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 36 మద్యం దుకాణాలు

పెందుర్తి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల పెందుర్తి, మధురవాడల్లో 36 ప్రైవేటు మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నాయని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ సరోజాదేవి మంగళవారం తెలిపారు. పెందుర్తిలో 16, మధురవాడలో 20 మొత్తంగా 36 మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులు లాటరీ ద్వారా దక్కించుకున్నారన్నారు. వీరంతా బుధవారం నుంచి షాపులు తెరుస్తారని, వారు సమర్పించిన అన్ని డాక్యుమెంట్లు ప్రభుత్వానికి సమర్పిస్తామని, 15 రోజుల్లో పర్మినెంట్ లైసెన్స్ మంజూరు చేస్తామని పేర్కొన్నారు. కాగా మద్యం దుకాణాల అద్దెలు భారీగా పెరిగాయి. పెందుర్తి, చినముషిడివాడ, సుజాతనగర్ ప్రాంతాల్లో ఇప్పటివరకు నెలకు రూ.40 వేలు అద్దె ఉన్న షాపు అద్దె ఇప్పుడు ఒక్కసారికిగా రూ.80 వేల నుంచి రూ.లక్షకు పెంచేశారని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు,



సిరిపురం సర్కిల్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

హెల్మెట్లు ధరించని 182 మందిపై ఆర్టీవోకు ఫిర్యాదు

» జోరుగా పోలీసుల తనిఖీలు

సిరిపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణాలు చేస్తున్న సమయంలో విధిగా హెల్మెట్, సీటుబెలు పెట్టుకోవడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని తూర్పు జోన్ ట్రాఫిక్ సీఐ ఎస్.అమ్మినాయుడు తెలిపారు. మంగళవారం సిరిపురం, ద్రోణంరాజు సర్కిల్ ప్రాంతాల్లోని హెల్మెట్ లేని వాహనదారులపై తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు.హెల్మెట్‌లు లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 182 వాహనదారులపై ఆర్టీవోకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. హెల్మెట్ లేని వాహనదారులకు జరిమానాలు వేయడంతో పాటు వారి లైసెన్స్‌లు రద్దు చేయాలని ఆర్టీవోకు వాహనదారుల వివరాలతో ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు.

అలాగే రాత్రిపూట ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్నారని రాత్రి 9 నుంచి ఒంటి గంట వరకు తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు.ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాలు జరగకుండా తనిఖీలు చేస్తున్నారని తెలిపారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



స్వర్ణ పుష్పాలతో కనకమహాలక్ష్మి అమ్మవారు

జగదాంబ కూడలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారికి ఆలయ అధికారులు మంగళవారం అష్టదళ పద్మారాధన సేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూల విరాట్‌ను స్వర్ణకవచాలతో అలంకరించి, 108 స్వర్ణ పుష్పాలతో పూజలు జరిపారు. ఈ పూజల్లో పాల్గొనదలచిన భక్తులు రూ.1,116 చెల్లించాలని ఈవో కె.శోభారాణి తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారి దర్శనాలకు భక్తులు బారులు తీరారు.

నగరానికి రేపు నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం

విశాఖపట్నం,అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం ఈ నెల 17, 18 తేదీల్లో విశాఖ జిల్లా పర్యటనకు రానున్నారు. నగరంలో ఆయన పర్యటనకు సంబంధించిన వివరాలను అధికారులు ఆ రోజే వెల్లడించనున్నారు.

ఆచార్య సరస్వతీవిద్యార్థికి ఏయూ వీసీ అభినందన



సరస్వతీవిద్యార్థిని అభినందిస్తున్న వీసీ శశిభూషణరావు

వెంకోజీపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఏయూ సంగీత విభాగం ఆచార్యులు కె.సరస్వతీవిద్యార్థిని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు మంగళవారం తన కార్యాలయంలో అభినందించారు. ఇటీవల విశాఖ మ్యూజిక్ అకాడమీ వారు డాక్టర్ సరస్వతి విద్యార్థిని నేదునూరి కృష్ణమూర్తి ఎండోమెంట్ అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య సరస్వతి విద్యార్థినిని వీసీ తన కార్యాలయంలో అభినందించారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఏయూ సంగీత విభాగానికి మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని వీసీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పురాతన సామగ్రి సేకరణ కర్తకు పురస్కారం



శివప్రకాశ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు, అధికారులు

వెంకోజీపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పురాతన వస్తువులు, నాణేలు, స్టాంపులు సేకరించి వివిధ జిల్లాలో పలు ప్రదర్శనలు నిర్వహించే 15వ వార్డులోని జేఆర్‌నగర్‌కు చెందిన విశ్రాంత సహకార బ్యాంకు ఉద్యోగి జీఎస్ శివప్రకాశ్‌కు విజయనగరంలో జరిగిన పైడితల్లమ్మ ఉత్సవంలో ప్రత్యేక గుర్తింపు లభించింది. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు విజయనగరం ఉత్సవంలో శివప్రకాశ్ వివిధ వస్తువులను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను విజయనగరం జిల్లా జాయింట్ కలెక్టర్‌తో పాటు, జిల్లా విద్యాశాఖాధికారి, ఇతర ఉత్సవ కమిటీ సభ్యులు, పలువురు నాయకులు, విద్యార్థులు ప్రదర్శనను తిలకించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రశంసా పత్రాన్ని, జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా శివప్రకాష్ మాట్లాడుతూ ఈ గుర్తింపు లభించడం ఆనందంగా ఉందన్నారు.

కీలక పీఎస్.. ఒకే ఒక్క ఎస్ఐ



» ఎంపీవీ కాలనీ పోలీస్‌స్టేషన్‌కు వేధిస్తున్న సిబ్బంది కొరత

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరత వేధిస్తోంది. కొత్తగా వచ్చే సర్కిల్ ఇన్‌స్పెక్టరుకు ఇదే పెద్ద సవాలుగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. స్మార్ట్ పోలీస్ స్టేషన్‌గా పేర్కొనే ఈ స్టేషన్‌లో కేసుల తాకిడి ఎక్కువగానే ఉంటుంది. ముఖ్యంగా ఈ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్ల ఆగడాలు ఎక్కువ. నగరంలోని మిగతా ప్రాంతాలతో పోలిస్తే హత్యలు, హత్యాయత్నాలు వంటి కేసులు తరచూ నమోదవుతుంటాయి. ఇక పోలీసు సిబ్బందిపైనే నిందితులు తిరిగి దాడి చేసిన సందర్భాలు ఉన్నాయి. ఇతర స్టేషన్లతో పోల్చుకుంటే ఆధునిక భవనం, వసతులు వంటివి బాగానే కనిపిస్తాయి. కానీ పాలనాపరమైన అంశాల్లో చూస్తే సిబ్బంది లేమి చాలా ముఖ్యమైనది.

నగరంలోని అన్ని స్టేషన్లలోనూ ముగ్గురు లేదా నలుగురు ఎస్ఐలు అందుబాటులో ఉంటుండగా, ఇక్కడ మాత్రం ఒకే ఎస్ఐతో నెట్టుకువస్తున్నారు. దీనివల్ల ఒక్కరిపై పనిభారం పెరగడం, ముఖ్యమైన అంశాల్లో పర్యవేక్షించే అవకాశం ఉండటం లేదు. దీంతో స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరగడంలేదనే విమర్శ ఉంది. స్టేషన్ మొత్తం మీద సుమారు 50 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఎస్ఐ ఒక్కరే ఉండగా, ముగ్గురు ఏఎస్ఐలు, ఎనిమిది మంది హెడ్ కానిస్టేబుళ్లు, మిగిలిన వారు కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరందరినీ ఎస్ఐలు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఎవరెవరు ఏం చేస్తున్నారు, ఎవరు ఏం చేయాలన్న దానిపై ఆయా ఎస్ఐలకు అవగాహన ఉంటుంది. స్టేషన్ పరిధిలో తరచూ దెబ్బలాటలు, కుటుంబ కలహాలు, అదృశ్యం కేసులు, ఒక్కోసారి హత్య కేసులు ఉంటాయి.

కింది స్థాయి అధికారులు లేకపోవడం వల్ల కేసుల దర్యాప్తులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పర్యవేక్షణ కొరవడడంతో ఇటీవల ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తికి సంబంధించిన సమాచారం సంబంధిత కుటుంబానికి ఇవ్వకపోవడం, అదే వ్యక్తికి సంబంధించిన అదృశ్యం కేసు నమోదు చేయడం, ఆ వ్యక్తి సరైన చికిత్స అందక మృతి చెందడం వంటివి వివాదస్పదమయ్యాయి.

ముఖ్యంగా ఈ స్టేషన్ పరిధిలో ప్రముఖులు ఉండడం వల్ల కూడా ప్రోటోకాల్ విధులు ఉంటాయి. నగరంలో కీలకమైన స్టేషన్‌కు సిబ్బంది కేటాయించకపోవడంలో అంతర్యమేమిటో ఉన్నతాధికారులకే తెలియాలి.

20న గద్దర్ స్మారక సభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు తదితరులు

వెంకోజీపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజా చైతన్యం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప చరిత్రకారుడు గద్దర్ అని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఈఎస్ ధనుంజయరావు అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో గద్దర్ సభ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలు, బహుజనుల కోసం తన జీవితాంతం సాహిత్య సేవ చేసి తన పాటతో కడవరకూ ప్రశ్నించారన్నారు. విశ్రాంత ఆచార్యులు కె.జాన్ మాట్లాడుతూ ఈ నెల 20న పౌరగ్రంథాలయంలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి 7 గంటల వరకు గద్దర్ సభ జరుగుతుందన్నారు. ఈ రెండు కార్యక్రమాలకు రిసెర్చ్ స్కాలర్స్ విద్యార్థులు కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు హాజరవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు ప్రేమానంద, జర్ర అప్పారావు, పాట తూట ఉదయభాస్కర్, ప్రజా గాయకుడు మజ్జి దేవీశ్రీ, అంబేద్కర్, ఆరేటి మహేష్, డాక్టర్ టి.షారన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం హరించేశారే!

» కళావిహీనంగా తయారైన విమ్స్ రహదారి

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పచ్చగా, అందంగా అలరారుతూ, నీడను ఇస్తున్న చెట్ల కొమ్మలను దారుణంగా నరికేశారు. జాతీయ రహదారి నుంచి విమ్స్ ఆస్పత్రికి వెళ్లే రహదారి మధ్యలో, అటు ఇటు పచ్చని చెట్లు ఉన్నాయి. పచ్చదనాన్ని వెదజల్లడమే కాకుండా నీడ, చల్లదనాన్ని ఇస్తుండేవి. అయితే వీటి వల్ల చీకటి పడితే విద్యుత్ వెలుగులకు ఇబ్బంది ఎదురవుతుందనే కారణంతో మూడు వరుసల్లో ఉన్న చెట్ల కొమ్మలను దారుణంగా నరికేశారు. ఇది చూసిన పలువురు వెలుగు కోసం ప్రత్యామ్నాయం చూడకుండా చెట్ల కొమ్మలు నరికేయడం ఏమింటంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఎక్కడ ఇబ్బంది ఎదురవుతుందో అక్కడ మాత్రమే కొమ్మలు తొలగించాల్సి ఉండగా, మొత్తం అన్ని చెట్ల కొమ్మలూ నరికేయడం ఏమిటో అధికారులకే తెలియాలి. అందంగా కనిపించే ఆ రహదారి ఇప్పుడు కళావిహీనంగా కనిపిస్తోంది.



చెట్ల కొమ్మలు నరికి వేయడంతో బోసిపోయిన విమ్స్‌కు వెళ్లే రహదారి

అసంపూర్తిగా కాలువ పనులు

» వర్షాలకు మట్టి కొట్టుకుపోవడంతో కూలిపోయే పరిస్థితిలో విమ్స్ ప్రహరీ, విద్యుత్ స్తంభం

ఆరిలోవ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పెదగదిలి జంక్షను నుంచి తోటగరువు వెళ్లే రోడ్డులో వంతెన పనులు పూర్తి చేశారు గాని, పెదగదిలి నుంచి వచ్చే వర్షం వెళ్లే గెడ్డ నీరు మరలించేందుకు కాలువ పనులు ప్రారంభించే మధ్యలోనే ఆపేశారు. కాలువ పనులు చేపట్టే సమయంలో..రహదారి వెడల్పు చేసే ఉద్దేశంతో విమ్స్ ప్రహరీ గోడను కూల్చివేశారు. అనంతరం పునాదులు తవ్వి కాంక్రీట్ వేశారు. ఆ తర్వాత పనులు నిలిపివేశారు. దీంతో వర్షం వచ్చినప్పుడు నీటి ప్రవాహం పెరుగుతోంది. దీనివల్ల ఇక్కడ ఉన్న విద్యుత్ స్తంభం కింద మట్టి కొట్టుకుపోయింది. స్తంభం ఎప్పుడైనా కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. అలాగే గెడ్డ వరద తాకిడికి ప్రహరీ గోడ కూడా బలహీనంగా తయారైంది. కాలువ పనులు ప్రారంభించి సుమారు 4 నెలలు కావచ్చింది. అసంపూర్తిగా నిలిపేసిన పనుల విషయంలో అధికారులు స్పందించడం లేదు. ఇప్పటికైనా ఇంజనీరింగ్ అధికారులు స్పందించి స్తంభం పడిపోకుండా, ప్రహరీ గోడ కూలిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కోరింతకు గురై మట్టి కొట్టుకుపోవడంతో కూలడానికి సిద్ధంగా ఉన్న విమ్స్ ప్రహరీ, విద్యుత్ స్తంభం

బడా నేత అండతో రోడ్డు కబ్జా

» చక్రం తిప్పుతున్న సచివాలయ ఉద్యోగి

» ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోని అధికారులు

మద్దిలపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీ వుడా లేఅవుట్ (ఎల్.పి నంబర్ 40/91)లో 30 అడుగుల రోడ్డు ఆక్రమణపై చర్యలు తీసుకోవడానికి అధికారులు మీనామీసాలు లెక్కిస్తున్నారు. రోడ్డు ఆక్రమణపై స్థానికులు జిల్లా కలెక్టరేట్, జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల వేదికలో ఫిర్యాదులు చేసిన ఫలితం కానరావడం లేదు. రోడ్డు కబ్జాకు ఓ స్థానిక నేత అండగా నిలవడంతో అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సదరునేతకు సన్నిహితంగా మెలగే సచివాలయ ఉద్యోగే ఆక్రమణ ఈ స్థల వివాదంలో చక్రం తిప్పుతున్నారన్న ఆరోపణలుఉన్నాయి.

జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురంకాలనీలో గజం లక్షన్నర రూపాయలు పలుకుతోంది. ఇక్కడ వుడా లే అవుట్‌జాతీయ రహదారికి మధ్యలో ప్రైవేటు వ్యక్తుల స్థలం ఉంది. వారి స్థలం సరిహద్దుతోనే లే అవుట్ రోడ్డు క్లోజ్ అవడంతో రోడ్డుపై కన్నేశారు. స్థలం చదును చేసే పనుల్లో భాగంగా 30 అడుగుల రోడ్డును కూడా చదును చేసి స్థలంలో కలిపేసుకున్నారు.

దీనిపై స్థానికులు జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఇటీవల జోన్-3 టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ స్థలాన్ని పరిశీలించారు. జీవీఎంసీ సర్వేయర్‌తో సర్వే చేయించి రోడ్డు మార్కింగ్ వేయాలని సచివాలయ టౌన్‌ప్లానింగ్ కార్యదర్శి జ్యోతికి ఆదేశించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఆదేశించినా టౌన్‌ప్లానింగ్ కార్యదర్శి ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. అంతేకాకుండా ఆక్రమణదారులు వివాద స్థలంలో ఎక్సకవేటర్లతో చదును చేసే పనులు నిర్వహిస్తున్నా అటువైపు కన్నెత్తి చూడడం లేదు. అయితే ఈ రహదారి ఆక్రమణలో ఓ బడా నేత, సచివాలయ ఉద్యోగికి పెద్ద మొత్తంలో ముట్టినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో స్థానికుల ఫిర్యాదులపై అధికారులు చర్యలు తీసుకోకుండా సదరు నేత తీవ్ర ఒత్తిడి చేస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ స్పందించి రోడ్డు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఆక్రమించిన స్థలంలో చదును చేస్తున్న దృశ్యం

వాల్తేరు రైల్వేలో పక్కాగా స్వచ్ఛతా పక్వాడా

విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 1 నుంచి 15 వరకు వాల్తేరు రైల్వేలో చేపట్టిన స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమం మంగళవారం ముగిసింది.ఈ సందర్భంగా డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్, ఇతర అధికారులు, ఉద్యోగులు పారిశుధ్య పనులు చేపట్టారు. అనంతరం డీఆర్‌ఎం మాట్లాడుతూ డివిజన్ వ్యాప్తంగా 15 రోజులు నిర్వహించిన స్వచ్ఛతా పక్వాడాలో రైల్వే స్టేషన్లు, రైల్వే కాలనీలు, డీజిల్ లోకోషెడ్, విద్యుత్ లోకోషెడ్, కోచింగ్ కాంప్లెక్సు, కార్యనిర్వాహక కార్యాలయాల్లో పరిశుభ్రత పాటించినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ నిషేధం, మొక్కల పెంపకం ఆవశ్యకతపై వీధి నాటకాల ప్రదర్శనతో అవగాహన చేపట్టామన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, సివిల్ డిఫెన్స్, వాల్తేరు మహిళా సంక్షేమ సంఘం, ఇతర స్వచ్ఛంద సంస్థలతో కలిసి అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు డీఆర్‌ఎం వివరించారు. స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాల్లో భాగంగా రైల్వే స్టేషన్లలో 550 కిలోల ప్లాస్టిక్ సంచులు, సీసాలు సేకరించి, ఎక్కడపడితే అక్కడ ఉమ్మివేసి అపరిశుభ్రతకు పాల్పడిన వారిపై 1,356 కేసులు నమోదు చేసి వారి నుంచి రూ.3 లక్షల జరిమానా వసూలు చేశామన్నారు. డివిజన్ వ్యాప్తంగా ప్రయాణికులు, పారిశుధ్య కార్మికులకు సుమారు రెండు వేల గుడ్డ సంచులను పంపిణీ చేశామన్నారు. భారత్ స్వచ్ఛ రైల్ లక్ష్యాన్ని సాధించేందుకు స్వచ్ఛతా మిషన్ నిరవధికంగా కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు మనోజ్‌కుమార్ సాహు, సుధీర్‌కుమార్ గుప్తా, వాల్తేరు మహిళా సంక్షేమ సంఘం ప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికునికి గుడ్డ సంచులు అందజేస్తున్న డీఆర్‌ఎం

గురుకుల విద్యార్థులకు హెయిల్ స్టైల్, బ్యూటీ పార్లర్ శిక్షణ

ఆరిలోవ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఒక వ్యక్తి అందం, ఆరోగ్యంగా ఉండాలంటే అందుకు దోహదపడే మెలకువలను తెలుసుకోవాలని వొకేషనల్ ఉపాధ్యాయురాలు ఎస్.ద్రాక్షాయణి అన్నారు. శ్రీకృష్ణాపురంలోని అంబేద్కర్ గురుకుల విద్యార్థులకు దసరా సెలవుల్లో వృత్తి విద్యా నైపుణ్యాన్ని గురించి తగిన మెలకువలను విద్యారులకు గాజువాకలోని వేంకటేశ్వర హెయిర్ స్టైయిల్‌లో పది రోజుల పాటు శిక్షణ అందించినట్టు గురుకుల సంస్థ ప్రిన్సిపాల్ వి.రత్నవల్లి తెలిపారు. మంగళవారం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నవల్లి మాట్లాడుతూ సర్వశిక్ష అభియాన్ ఆదేశాల మేరకు వృత్తివిద్య శిక్షణలో భాగంగా ఈ శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ శిక్షణను వొకేషనల్ ఉపాధ్యాయురాలు దాక్షాయణి ఆధ్వర్యంలో నిర్వహించినట్టు చెప్పారు. ఈ ఇంటర్న్‌షిప్ శిక్షణలో అందం, హెయిర్ స్టయిల్‌కు సంబంధించిన అంశాలను నేర్చుకున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా సమన్వయకర్త రూపవతి తదితరులు పాల్గొన్నారు.



హెయిర్ స్టైల్‌పై శిక్షణ ఇస్తున్న ద్రాక్షాయణి



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

స్టీల్‌ప్లాంట్ కార్మిక సమ్మెపై భిన్నాభిప్రాయాలు

» సమ్మెలో పాల్గొనబోమని పేర్కొన్న కొన్ని కార్మిక సంఘాలు

» ఇలాగైతే 'ఉక్కు' భవిష్యత్తుకు ప్రమాదమంటున్న మరికొన్ని సంఘాల నాయకులు



ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, కార్మిక సంక్షేమంపై ఈ నెల 28న సమ్మె చేస్తామని ఉక్కు యాజమాన్యానికి కార్మిక సంఘాలు ఇచ్చిన నోటీసుపై కార్మిక వర్గంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జాతీయ ఎన్‌జేసీఎస్ (నేషనల్ జాయింట్ కౌన్సిల్ ఫర్ స్టీల్) కార్మిక సంఘాలు మాత్రమే సమ్మె నోటీసు ఇచ్చాయని, కొన్ని కార్మిక సంఘాలతో సంప్రదింపులు చేయలేదని పలు సంఘాలకు చెందిన కార్మిక నాయకులు పేర్కొంటున్నారు.

స్టీల్‌ప్లాంటులో ఎన్నో సమస్యలు ఉన్నాయని, ముఖ్యంగా ప్రైవేటీకరణ పిడుగు ప్లాంట్ నెత్తిపై ఉందని, ఈ క్రమంలో సమ్మె చేస్తామని యాజమాన్యానికి కొన్ని కార్మిక సంఘాలు మాత్రమే నోటీసు ఇవ్వడంపై నాయకులు మండిపడుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్లాంటులో ఉన్న అన్ని కార్మిక సంఘాలతో ప్రధాన కార్మిక సంఘాలు కలిసి పోరాటాలు చేయడం లేదని, ఎవరికి నచ్చినట్లు వారు వ్యవహరిస్తున్నారని, ఇది ప్లాంట్ భవిష్యత్తుకు తీవ్ర ప్రమాదమని కొన్ని సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉక్కు కర్మాగారం భవిష్యత్తు కోసం యోచించే ముందు అన్ని వర్గాల మద్దతు తీసుకోవాల్సి ఉండగా, ఇప్పుడు కేవలం తమ పబ్బం గడుపుకునేందుకు మాత్రమే ప్రధాన కార్మిక సంఘాలు వ్యవహరిస్తున్నాయని పలువురు కార్మికులు ఆరోపిస్తున్నారు.

ఇదిగా ఉండగా ఈ నెల 28న సమ్మెలో పాల్గొనేది లేదని కొన్ని నాన్ ఎన్‌జేసీఎస్ సంఘాల నాయకులు పేర్కొన్నారు.

నేటి నుంచి న్యూరో వైద్యుల జాతీయ సదస్సు

» దేశ, విదేశాల నుంచి హాజరు

» నూతన సమస్యలు, అధునాతన వైద్య సదుపాయాలపై చర్చలు

విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : విశాఖ వేదికగా బుధవారం నుంచి 20వ తేదీ వరకూ న్యూరాలజీ వైద్యుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు సదస్సు చైర్మన్, ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు పేర్కొన్నారు. కేజీహెచ్‌లోని సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో గల అంకాలజీ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన సదస్సు వివరాలను వెల్లడించారు. దేశ, విదేశాల నుంచి వైద్య నిపుణులు పాల్గొని అధునాతన వైద్య విధానాలు, కొత్తగా వస్తున్న న్యూరో సంబంధిత సమస్యలపై ప్రసంగిస్తారన్నారు. సుమారు రెండు వేల మంది న్యూరాలజీ వైద్య నిపుణులు ఈ సదస్సులో పాల్గొంటారని వెల్లడించారు. ప్రముఖ వైద్యులకు సంబంధించిన నాలుగు స్మారక ప్రసంగాలు ఉంటాయన్నారు. ఈ సదస్సుకు ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు, డీఎంఈ డాక్టర్ డీవీఎల్ నరసింహం హాజరవుతున్నారన్నారు. సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ, కేజీహెచ్ న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.గోపి మాట్లాడుతూ ఈ సదస్సులో మూర్ఛ వ్యాధి, స్ట్రోక్ సమస్యలపై ప్రధానంగా చర్చిస్తామన్నారు. ఆయా సమస్యలకు సంబంధించి వచ్చిన అధునాతన వైద్య విధానాలను ప్రముఖులు తెలియజేస్తారన్నారు. న్యూరో వ్యాధులపై అవగాహన కలిగించేలా ఈ నెల 20వ తేదీ ఉదయం ఆరు గంటలకు రన్ ఫర్ బ్రెయిన్ అనే థీమ్‌తో ప్రత్యేకంగా వాక్ నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ సమావేశంలో న్యూరాలజీ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సతీష్, డాక్టర్ సుష్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో సీపీ ఫోన్ నంబరు

భీమునిపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా ప్రతీ సోమవారం నగరంలోని పోలీసు కమిషనరు కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ పీజీఆర్ఎస్‌లో నేరుగా సీపీ శంఖబ్రత బాగ్చీకి తెలియజేయవచ్చు. ఇపుడు వివిధ సమస్యలపై పోలీసు స్టేషన్‌లకు వచ్చే బాధితులు తమకు స్థానికంగా వున్న పోలీసు అధికారులనుంచి సరైన న్యాయం జరగలేదని భావిస్తే తక్షణం సీపీకి ఫోన్ చేసి విన్నవించుకునేలా పోలీసు స్టేషన్‌లో ఆయన సెల్‌ఫోన్, వాట్సాప్ నంబరు 7995095799ను లా అండ్ ఆర్డర్, క్రైమ్, ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ల వద్ద బోర్డును ఏర్పాటు చేశారు.



☛ సంక్షిప్తంగా..

వరద బాధితులకు చైతన్య కళాశాల విరాళం



ఏయూ రిజిస్ట్రార్‌కు విరాళం అందజేస్తున్న చైతన్య కళాశాల ప్రతినిధులు

వెంకోజీపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల సంభవించిన వరదల కారణంగా ఇబ్బందులు పడిన రాష్ట్ర ప్రజలకు తమ వంతు సహాయంగా గాజువాకలోని చైతన్య కాలేజ్ ఫర్ ఉమెన్ రూ.లక్ష విరాళాన్ని అందజేసింది. మంగళవారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఈఎస్ ధనుంజయరావును కళాశాల ప్రతినిధులు కలిసి విరాళాలకు సంబంధించిన చెక్‌ను అందజేశారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా



ప్రమాదానికి గురైన కారు

ఆరిలోవ. అక్టోబరు 15 : ఆరిలోవ ఆఖరి బస్టాప్ సమీపంలో గల ముత్యాలమ్మ ఆలయం వద్ద కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బ తింది. ఇందకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

ఆరిలోవ కాలనీ నుంచి స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ రోడ్డులో కారులో ఇద్దరు యువకులు మంగళవారం సాయంత్రం అతి వేగంగా వెళుతుండగా, ముత్యాలమ్మ గుడి ప్రాంతం వచ్చేసరికి కారు బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో ఎడమ వైపు తిప్పగా, కారు డివైడర్‌ని ఢీకొని పల్టీ కొట్టింది. కారు రేడియేటర్ పూర్తిగా పాడైంది. స్థానికులు కారులో ఉన్న ఇద్దరు యువకులను బయటకు తీశారు. అయితే వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అక్కడ ఉన్న వారు ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా విద్యార్థుల దినోత్సవం



విద్యారులకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

తగరపువలస, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని స్థానిక బంగ్లామెట్ట పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. పలువురు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రపంచశాంతి కోసం పరితపించిన కలాం జన్మదినాన్ని అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవంగా ప్రకటించడం ఆనందదాయకమని హెచ్ఎం అప్పలరాజు అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు.

డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పద్మనాభం, అక్టోబరు 15, (ఆంధ్రజ్యోతి) : స్థానిక భవిత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం రెడ్డిపల్లి ఎంపీపీ పాఠశాలలో డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రెడ్డిపల్లి జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.సన్యాసిరావు మాట్లాడుతూ ఈ డిస్లెక్సియా ద్వారా ఎదురయ్యే మాట్లాడడం, చదవడానికి ఉండే సమస్యను నిరంతర సాధనతో అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, శ్రీనివాసరావు, హెచ్ఎం కళావతి తదితరులు పాల్గొన్నారు.

నాన్ టీచింగ్ పోస్టులకు 90 దరఖాస్తులు

పద్మనాభం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీ పాఠశాల, రెడ్డిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో అవుట్‌సోర్సింగ్ విధానంలో పని చేయడానికి నాన్ టీచింగ్ పోస్టుల భర్తీ కోసం మంగళవారంతో గడువు ముగిసే సమయానికి 90 దరఖాస్తులు అందినట్టు ఎంఈవో పి.రమణ తెలిపారు. ఇందులో పద్మనాభం కేజీబీవీలో వాచ్ వుమన్ పోస్టుకు 33 దరఖాస్తులు, రెడ్డిపల్లి పాఠశాలలో హెడ్ కుక్ పోస్టుకు 24, అసిస్టెంటు కుక్‌కు 28, చౌకీదార్ పోస్టుకు ఐదు దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిని సమగ్ర శిక్ష కార్యాలయానికి పంపిస్తామని ఆయన పేర్కొన్నారు.

సినిమా గైడ్

● **వేట్టయాన్** : సంగం, రమాదేవి, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, లక్ష్మి (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాత (తగరపువలస)

● **విశ్వం** : శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం),మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **జనక అయితే గనక** : శారద, కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)

● **మా నాన్న సూపర్‌హీరో** : గోకుల్, మౌర్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)

● **శ్వాగ్** : శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)

● **దేవర** : మెలోడి, జగదాంబ, శరత్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 49, టమాటా 50, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 54, బెండకాయలు 36, పచ్చిమిర్చి 60, కాకరకాయలు 36, బీరకాయలు 40, ఆనపకాయ 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజ్ 26, క్యారెట్ 50 దొండకాయలు 40, బంగాళదుంపలు 30, అరటికాయ (పెద్దది) 8, మునక్కాడలు (కిలో) 82, అల్లం (పాతది) 100, బరబాటి 44, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 85, గోరుచిక్కుడు 30, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 26, బీన్స్ (పెన్సిల్) 110, పొటల్స్ 60, కీరదోస 32, క్యాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 32, కంద 62, దేముడు చిక్కుడు 70, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్రరపెండలం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	120
ఫారం ధర	149
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

మినీ డెయిరీలకు ఆర్థిక తోడ్పాటు

- వివిధ గ్రామాల్లో ఏర్పాటు
- పాల ఉత్పత్తిలో సత్ఫలితాలు
- షెడ్డుల నిర్మాణం, పాడి గేదెల కొనుగోలుకు బ్యాంకు రుణాలు



తాటితూరు వద్ద ఏర్పాటు చేసిన మినీ డెయిరీ

భీమునిపట్నం (రూరల్), అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : పాల ఉత్పత్తి పెంచే క్రమంలో వివిధ ప్రాంతాల్లో మినీ డెయిరీల ఏర్పాటును ప్రోత్సహించడానికి అధికారులు ప్రయత్నాలుచేస్తున్నారు. ఇంతవరకు పాల సరఫరా చేసే పెద్ద డెయిరీలు రైతులకు పాడిగేదెలు, ఆవులు కొనుగోలు చేయడానికి ఆర్థిక సాయం చేస్తూ వారి నుంచి ప్రతి రోజూ పాలను సేకరిస్తుంటారు. ఈ విధంగా అనేక పెద్ద డెయిరీలకు చెందిన పాడి గేదెల పెంపకాలు జరుగుతున్నాయి. ఈ విధంగా డెయిరీలు నిర్వహించేవారు తమ డెయిరీలలో పాలను వారికి తప్ప ఇతరులకు అమ్మకాలు చేయడానికి అవకాశం ఉండదు. అందువల్ల ధర తక్కువ అయినా వారికే అమ్మకాలు చేస్తుంటారు. ఇందువల్ల కొత్తగా డెయిరీలు ఏర్పాటు చేయాలనుకున్న వారికి అవకాశాలు లభించడం లేదు. ఇటువంటి వారి కోసం అధికారులు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టారు. చిన్న, మధ్య తరహా, భారీ అనే మూడు విభాగాలలో డెయిరీలను ఏర్పాటు చేయాలనుకున్న వారికి షెడ్డుల నిర్మాణం, పాడి గేదెల కొనుగోలు, వాటికి ఇన్సూరెన్సు వంటి వాటి కోసం రుణ సదుపాయాలను కల్పిస్తున్నాయి. భారతీయ స్టేటు బ్యాంకు, యూనియన్ బ్యాంకులు కూడా రుణాలు అందించడానికి ముందుకు వస్తున్నాయి. అధికారులు సన్న, చిన్నకారు రైతులకు 30 శాతం రాయితీ కూడా అందిస్తోంది. చాలామంది రైతులు ఈ అవకాశాలను వినియోగించుకుని మినీ డెయిరీలను ఏర్పాటు చేసుకుంటున్నారు.

ఈ ఏడాది ఇప్పటి వరకు భీమిలి మండలంలో 12 మినీ డెయిరీలు ఏర్పాటయ్యాయి. దాకమర్రి, బోడమిట్టపాలెం, అల్లుపేట, చిప్పాడ, లక్ష్మీపురం, తాటితూరు, నగరపాలెం, సింగనంబ తదితర ప్రాంతాలలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఉత్పత్తి అవుతున్న పాలను స్థానిక వినియోగానికి జాతీయ రహదారి పక్క హోటళ్లు, విశాఖలో స్టార్ హోటళ్లకు నేరుగా సరఫరా చేస్తున్నారు. ప్రైవేటు రంగంలో ఉన్న కార్పొరేట్ డెయిరీలకు అందుబాటులో లేకుండానేరుగా లాభాల బాటన నడుస్తున్నాయి. డెయిరీల ఏర్పాటుకు అధికారులు నిబంధనలు సరళతరం చేయడంతో చాలామంది కొత్తగా డెయిరీలు ఏర్పాటు చేయడానికి సిద్ధపడుతున్నారు.

సంక్షేమం, అభివృద్ధి ప్రధానంగా కూటమి పాలన



పెంట గ్రామంలో సీసీ రోడ్లుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా

పద్మనాభం రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు.మంగళవారం అనంతవరం, పెంట గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమాన్ని అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అనంతవరం-నుంచి గంధవరం బీటీ రోడ్డు వంతెన నిర్మాణానికి, పెంటలో సీసీ రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో 22 పంచాయతీల్లో 28 అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ4.32 కోట్లు మంజూరైనట్టు చెప్పారు. అభివృద్ధి, సంక్షేమానికి సమన్వయం చేస్తూ కూటమి ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయకుమార్, తహసీల్దార్ ఆనందరావు, పెంట సర్పంచ్ బొదల పావని, టీడీపీ మండల అధ్యక్షుడు కె.రమణ, నేతలు గొర్రిపాటి పెద ఎర్రినాయుడు, కోరాడ రాజబాబు, సందీప్, రామానాయుడు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

క్రీడా మైదానం అభివృద్ధి చేస్తాం

కొమ్మాది : చంద్రంపాలెం పాఠశాలలో క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన మంగళవారం కురిసిన వర్షానికి చిత్తడిగా మారిన పాఠశాల క్రీడామైదానాన్ని పరిశీలించారు. ఇటీవల మంత్రి నారా లోకేష్ విశాఖపట్నం పర్యటన సందర్భంగా ఈ పాఠశాలను సందర్శించినప్పుడు గంటా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కొంత పని ప్రారంభమైనప్పటికీ పూర్తి స్థాయిలో పని జరగకపోవటంతో వర్షం పడితే క్రీడా మైదానం చిత్తడిగా మారుతోందని ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు చెప్పారు. కచ్చితంగా క్రీడా మైదానం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని గంటా హామీ ఇచ్చారు.

ప్రజలకు అందుబాటులో సీపీ ఫోన్ నంబరు



భీమునిపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి నగర పోలీసు కమిషనరు తీసుకుంటున్న చర్యలు పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా ప్రతీ సోమవారం నగరంలోని పోలీసు కమిషనరు కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ పీజీఆర్ఎస్‌లో నేరుగా సీపీ శంఖబ్రత బాగ్చీకి తెలియజేయవచ్చు. ఇపుడు వివిధ సమస్యలపై పోలీసు స్టేషన్‌లకు వచ్చే బాధితులు తమకు స్థానికంగా వున్న పోలీసు అధికారులనుంచి సరైన న్యాయం జరగలేదని భావిస్తే తక్షణం సీపీకి ఫోన్ చేసి విన్నవించుకునేలా పోలీసు స్టేషన్‌లో ఆయన సెల్‌ఫోన్, వాట్సాప్ నంబరు 7995095799 ను భీమిలి లా అండ్ ఆర్డర్, క్రైమ్, ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ల వద్ద బోర్డును ఏర్పాటు చేసారు. ప్రజలకు న్యాయం అందేలా తీసుకుంటున్న నగర పోలీసు కమిషనరు చర్యలు పలువురు అభినందిస్తున్నారు.

తాళ్లవలస హైస్కూలులో హ్యాండ్ వాష్ డే



భీమునిపట్నం (రూరల్), అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : భీమిలి మండలం తాళ్లవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మంగళవారం గ్లోబల్ హ్యాండ్‌వాష్ దినోత్సవాన్ని నిర్వహించారు. మ్యాజిక్ బస్ సంస్థకు చెందిన ప్రతినిధులు విద్యార్థులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి చేతులను శుభ్రం చేసుకునే విధానం, దానివల్ల ఉపయోగాలను వివరించారు. శుభ్రత అనేది ఒక అలవాటుగా మారాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కె.ప్రభాకరరావు మ్యాజిక్ బస్ సమన్వయ అధికారి దూడ రమేష్, ప్రతినిధులు రమణమ్మ, సాయికుమారి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పునఃప్రారంభానికి సిద్ధమవుతున్న బంగారమ్మ ఆలయం



సింహాచలం, అక్టోబరు 15: (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం, తదితర ఏడు గ్రామాల ప్రజల ఆరాధ్య దేవతగా పూజలందుకుంటున్న బంగారమ్మ నూతన ఆలయం ప్రారంభోత్సవానికి తుది మెరుగులు దిద్దుకుంటుంది. సుమారు రూ.35 లక్షలు వెచ్చించి గత పాలక మండల సభ్యుల అభ్యర్థన మేరకు బంగారమ్మ ఆలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. కొన్ని దశాబ్దాల క్రితం నుంచి ఉన్న పురాతన ఆలయంలో భక్తులు లేదా పూజారులు నిలబడి ధూపదీపాలు సమర్పించేందుకు స్థలాభావం ఉండేది. అటువంటి అలయాన్ని సువిశాలమైన ముఖ మండపం, ప్రధానాలయాలతో విశాలంగా నిర్మించారు. ప్రస్తుతం శాలహర నిర్మాణ పనులు జరుగుతున్నాయి. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్తల మండలి అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు అనుమతితో త్వరలో ఆలయాన్ని పునఃప్రారంభించాలని అధికారులు యోచిస్తున్నారు.

అబ్దుల్ కలామ్ సేవలు చిరస్మరణీయం



కలామ్‌కు నివాళులర్పిస్తున్న డైట్ ప్రిన్సిపాల్ జ్యోతికుమారి, తదితరులు

భీమునిపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దివంగత డాక్టర్ అబ్దుల్ కలామ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమైనవని జిల్లా విద్యా శిక్షణ సంస్థ డైట్ ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి అన్నారు. మంగళవారం డైట్‌లో అబ్దుల్ కలామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మిస్సైల్ మ్యాన్‌గా పేరొందిన కలామ్ మన దేశంలో పుట్టడం ప్రజలందరి అదృష్టమన్నారు. అనంతరం మూడో సెమిస్టర్ ఛాత్రోపాధ్యాయిని రేవతి అబ్దుల్ కలామ్ జీవిత చరిత్రను క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకుడు ఎల్.సుధాకర్, అధ్యాపకులు జీజీఎస్ నాగేశ్వరరావు, ఎం.మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.దుర్గాప్రసాద్ అబ్దుల్ కలామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు కలామ్ జీవిత విశేషాలను వివరించారు.

టీడీపీ ఆధ్వర్యంలో..

రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగా దేశానికి విశిష్ట సేవలందించిన దార్శనీకులు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న కలామ్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళ్ళర్పించారు. కార్యక్రమంలో నాయకులు కాసరపు నాగరాజు, కె.సన్యాసినాయుడు, ఎం.సంజీవ్‌కుమార్, కె.అప్పన్న, జి.పోలిరాజు, తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై నగదు రహిత లావాదేవీలకు డిమాండ్

సింహాచలం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నిత్యం లక్షలాది రూపాయల లావాదేవీలు జరుగుతున్న సింహగిరిపై నగదు రహిత లావాదేవీలకు రోజురోజుకు భక్తుల నుంచి అభ్యర్థనలు పెరుగుతున్నాయి. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని సమాజంలో అన్ని వర్గాల ప్రజలు ముందుకు సాగతున్న దూసుకుపోతున్న ప్రస్తుత తరుణంలో నగదు రహిత ఆర్థిక లావాదేవీలు జరపడంలో సింహాచల దేవస్థానం వెనకబడింది. సుమారు ఏడాది క్రితం ఈ-హుండీని మాత్రం అప్పటి కార్యనిర్వాహణాధికారి సింగాల శ్రీనివాసమూర్తి ప్రవేశ పెట్టారు. అయితే దీని సమాచారం కూడా భక్తులకు చేరేలా తగిన ప్రచారం లేదనే చెప్పవచ్చు. కాగా అప్పన్నస్వామి దర్శనాలు, ఆర్జిత సేవలు, ప్రసాదాల టికెట్లు, నిత్యాన్న ప్రసాదం, గో సంరక్షణ పథకం లేదా శాశ్వత ఆర్జిత సేవలకు తగు రుసుము చెల్లించాలనుకునే భక్తులు తప్పనిసరిగా నగదు ఉంటేనే చేయగలగుతారు. దీంతో కొందరు భక్తులు విరాళాలు చెల్లించాలనుకున్నప్పటికీ జేబులో నగదు లేక వెనుదిరిగి వెళ్లతున్నందున అప్పన్న దేవస్థానానికి కొంతమేర నష్టం వాటిల్లుతోంది. నగదు రహిత లావాదేవీలు లేవు సరే సింహగిరిపై ఏటీఎం కేంద్రం కూడా లేకపోవడంతో భక్తులకు ఇబ్బందికరంగా, ఇటు అప్పన్న ఖజానాకు, సింహగిరి వర్తకులకు ఎంతో కొంత నష్టం వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం ప్రస్తుత పీఆర్‌వో కార్యాలయానికి ఎదురుగా సుమారు రూ.3 లక్షలు వెచ్చించి ఏటీఎం ఏర్పాటుకు నిర్మాణం చేపట్టారు. అయితే ఏటీఎం ఏర్పాటుకు బ్యాంకుల నుంచి కాంట్రాక్టు కుదుర్చుకునేందుకు తీవ్ర జాప్యం జరుగుతుండడంతో ఈ భవనం వినియోగంలోకి రాకుండా నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ఇప్పటికైనా సింహగిరిపై దేవస్థానం లావాదేవీల్లో నగదు రహిత కార్యకలాపాలు జరిపేందుకు అనుకూలమైన సాంకేతిక ఏర్పాట్లు చేయాలని, ఏటీఎం కేంద్రాలను రెండైనా ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ధరల పెరుగుదలపై సీపీఐ ప్రచారం

కొమ్మాది, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నా ప్రభుత్వాలకు చీమ కుట్టినట్టు కూడా లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు విమర్శించారు. మంగళవారం మధురవాడ శివశక్తినగర్ రోడ్డులో ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ నిత్యావసర వస్తువుల పెరుగుదలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, మోదీ మూడోసారి ప్రధాని కావడంతో వ్యాపారులు పండగ చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. బ్లాక్ మార్కెట్‌ను కంట్రోల్ చేసే వ్యవస్థ లేకుండాపోయిందని, ఆగస్టు నెలలో 3.65 శాతం ఉన్న ద్రవ్యోల్బణం దసరా నాటికి 5.49 శాతానికి చేరుకుందన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రకాల నిత్యావసరాల ధరలు నింగిని తాకుతుండడంతో సామాన్య ప్రజల బతుకులు దుర్భరంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.వెయ్యి పట్టుకుని రైతు బజారుకు వెళితే సంచి నిండా కూరగాయలు నిండడం లేదని, వంటనూనెల రేట్లు భగ్గుమంటున్నాయని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ బేగం, వి.సత్యనారాయణ, ఎస్.కె.సల్మా, బి.కేశవయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.

యానాద్రి చెరువులో కోళ్ల వ్యర్థాలను వెంటనే తొలగించాలి

పద్మనాభం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రేవిడి యానాద్రి చెరువులో వేస్తున్న కోళ్ల వ్యర్థాల తొలగింపునకు చర్యలు చేపట్టాలని పద్మనాభం మండల విస్తరణాధికారి (పీఆర్అండ్‌ఆర్‌డీ) మీనాకుమారి అన్నారు. స్థానిక ఎంపీటీసీ సభ్యుడు ఎస్.సూరప్పుడు ఈ చెరువులో కోళ్ల వ్యర్థాలను వేస్తున్నారని, దీనివల్ల నీరు కలుషితమవుతోందన్నారు. దీంతోపాటు అక్కడ కుక్కలు చేరడం వల్ల ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహన చోదకుల వెంట అవి పడుతుండడంతో ప్రమాదాల బారిన పడుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని విస్తరణాధికారికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మీనాకుమారి చెరువును పరిశీలించారు. వ్యర్థాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం రేవిడిలో నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి, దీనిని వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.

భవిత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

భీమునిపట్నం, అక్టోబరు 15: మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న భవిత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం డిస్లెక్సియా వ్యాధిపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో హనుమంతరావు మాట్లాడుతూ ఈ నెల 18వ వరకు అవగాహన కార్యక్రమాలు జరుపుతామన్నారు. ఎంఈవో-1 ఎం.శివరాణి, తదితరులు పాల్గొన్నారు.

ధరలను నియంత్రించాలి : సీపీఐ



మధురవాడలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

మధురవాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర సరకుల ధరలు నియంత్రించడంలో విఫలమయ్యాయని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ళ పైడిరాజు విమర్శించారు..జీవీఎంసీ 7వ వార్డు పరిధిలోని శివశక్తినగర్‌లో మంగళవారం అధిక ధరలను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత ద్రవ్యోల్బణం రేటు 3.65శాతం నుంచి 5.49 శాతానికి పెరిగిందన్నారు. వంటనూనెలు, పప్పులు ధరలుతో పాటు ఆలుగడ్డలు, ఉల్లిపాయలు ధరలు కూడా ఆకాశ్యాన్నంటుతున్నాయని విమర్శించారు. ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. అనంతరం సీపీఐ నాయకులు శివశక్తినగర్‌లో ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎండీ బేగం, వి.సత్యనారాయణ, ఎస్.కె.సల్మా, బి.కేశవయ్య, రవి, వెంకటేశ్వరరరావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. కొమ్మాది: నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్నంటుతున్నా ప్రభుత్వాలకు చీమ కుట్టినట్టు కూడా లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అన్నారు. మధురవాడ శివశక్తినగర్ రోడ్డులో ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ ధరల పెరుగుదలపై సీపీఐ ప్రచారం చేపట్టింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు ఘోరంగా పెరిగాయని, మోదీ మూడోసారి ప్రధాని అయ్యాక వ్యాపారస్తులు పండగ చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ భేగం, వి.సత్యనారాయణ, ఎస్కే సల్మా, బి.కేశవయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బృందం పీహెచ్‌సీ సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం ప్రతినిధులు

ఆనందపురం, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర బృందం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అసంక్రమిత వ్యాధులపై రోగులకు వైద్య సేవలు ఎలా అందుతున్నాయో తెలుసుకునేందుకు కేంద్ర బృందం అధికారి డాక్టర్ జైత్రి నేతృత్వంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి తెలుసుకుంటున్నారు. అందులో భాగంగా ఆనందపురం వైద్య కేంద్రాన్ని పరిశీలించి రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ లాంటి వ్యాధులు ఎలా గుర్తిస్తున్నారు, రోగులకు ఎలాంటి వైద్య సదుపాయాలు అందుతున్నాయి అనే విషయంపై ఆరా తీశారు. లొడగలవానిపాలెం, వేములవలసకు చెందని రోగులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుమత, జిల్లా హెచ్‌డబ్ల్యూసి నోడల్ అధికారి డాక్టర్ బాలాజీ, స్థానిక వైద్యులు గంగునాయుడు, డాక్టర్ షహనాజ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే చంద్రన్న బీమా

భీమునిపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : చంద్రన్న బీమా పథకం అమలుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు తెలిపారు. మంగళవారం బీచ్‌రోడ్‌లోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో 17 నుంచి 70 ఏళ్ల మధ్య ఉన్న వారికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు, సాధారణ మరణం అయితే రూ.2 లక్షలు బాధిత కుటుంబానికి అందుతుందన్నారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం



స్వామివారికి హారతిస్తున్న అర్చకుడు

సింహాచలం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న స్వామి ఆర్జిత నిత్య కల్యాణాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువజామున సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి ప్రభాతారాధనలను యథావిధిగా జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని శ్రీదేవి, భూదేవి సమేతంగా ప్రత్యేకంగా అలంకరించిన రజిత వేదికపై అధిష్ఠింపజేసి భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించాక పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో కల్యాణాన్ని జరిపారు. స్వామికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చాక భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.



గంటలకు గంటలు ఫోన్‌లోనే...!

కొంతమంది పది గంటలకు పైగా.... మరికొంతమంది ఐదారు గంటలు...

సామాజిక మాధ్యమాలకు ఎక్కువ సమయం వినియోగిస్తున్న యువత

ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సైట్స్‌లో కనీసం రెండు నుంచి మూడు గంటలు



- మధ్య వయస్కుల్లో ఎక్కువ మంది యూట్యూబ్‌తో కాలక్షేపం
- మీ ఫోన్ స్క్రీన్ టైమ్ ఎంతో తెలుసా..!
- రోజుకు ఎన్ని గంటలు ఫోన్ వినియోగిస్తున్నారో ఎప్పుడైనా చెక్ చేశారా..?
- అతి వినియోగంతో అనారోగ్య సమస్యలు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి):

ప్రస్తుతం స్మార్ట్ ఫోన్‌తో ఎక్కువ సమయాన్ని గడుపుతున్న వారి సంఖ్య పెరిగింది. ఉద్యోగ, వ్యాపారరీత్యా ఫోన్ వాడాల్సిన అవసరం ఏర్పడింది. అయితే, చాలామంది ఎంటర్‌టైన్‌మెంట్ కోసం గంటల తరబడి ఫోన్ వినియోగిస్తున్నారు. తాము ఎంత సమయం ఫోన్‌కు వినియోగించామన్న విషయం మాత్రం పట్టించుకోవడం లేదు. 2018లో గూగుల్ స్క్రీన్ టైమ్ తెలుసుకునే వెసులుబాటును ఆండ్రాయిడ్ ఫోన్ వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రతిరోజూ ఎంత సమయాన్ని ఫోన్‌కు కేటాయించామనే విషయాన్ని దాని ద్వారా తెలుసుకోవచ్చు. తద్వారా ఫోన్‌కు వెచ్చించే సమయాన్ని తగ్గించుకునేలా ఎవరికి వారు జాగ్రత్తపడవచ్చు.

మూడింటికే 90 శాతం సమయం

స్క్రీన్ టైమ్ గురించి చాలామంది స్మార్ట్ ఫోన్ వినియోగదారులకు తెలియదు. నగర పరిధిలో వివిధ కేటగిరీలకు చెందిన పలువురి స్క్రీన్ టైమ్ తెలుసుకునే ప్రయత్నం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి చేయగా ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. 18 ఏళ్లలోపు వయసున్న ఐదుగురి ఫోన్‌లో స్క్రీన్ టైమ్ చూడగా సగటున తొమ్మిది గంటలు ఉంది. ఇందులో 90 శాతం సమయాన్ని ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాలకు కేటాయించినట్టు తేలింది. ఈ నెల పదో తేదీన ఇంటర్ రెండో ఏడాది చదువుతున్న దీపక్ స్క్రీన్ టైమ్ చూడగా 10 గంటలు 22 నిమిషాలు ఉంది. అందులో నాలుగున్నర గంటలపాటు ఇన్‌స్టాగ్రామ్, మూడు గంటలు యూట్యూబ్‌కు, మరో గంటన్నర వాట్సాప్‌కు, మిగిలిన సమయాన్ని ఇతర యాప్స్‌కు వినియోగించినట్టు తేలింది. ఒక ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న 24 ఏళ్ల దీప్తి ఫోన్ స్క్రీన్ టైమ్ ఏడు గంటలు ఉంది. ఇందులో దాదాపు మూడు గంటలు యూట్యూబ్ వీక్షించేందుకు వెచ్చించగా, ఇన్‌స్టాగ్రామ్‌కు 45 నిమిషాలు, వాట్సాప్‌కు గంటన్నర సమయాన్ని వెచ్చించినట్టు వెల్లడైంది. మరో గంట ఫోన్ కాల్స్. ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఒక ఉద్యోగి స్క్రీన్ టైమ్ పరిశీలించగా..ఐదున్నర గంటలు ఉంది. ఇందులో ఫోన్ కాల్స్‌కు సంబంధించి రెండున్నర గంటలు సమయం ఉండగా, వాట్సాప్‌కు మరో రెండు గంటలు వినియోగించినట్టు ఉంది. ఇతర యాప్స్‌కు మిగిలిన సమయాన్ని వినియోగించినట్టు వెల్లడైంది.

పద్దెనిమిదేళ్ల పైబడిన వారిలో మూడొంతులు మంది ఫోన్‌లో ఎక్కువ సమయం యూట్యూబ్ చూస్తున్నట్టు వెల్లడైంది. మహిళలు రోజువారీ స్క్రీన్ టైమ్ ఆరు గంటలు ఉంటే అందులో కనీసం రెండు నుంచి మూడు గంటలు యూ ట్యూబ్‌కు వినియోగిస్తుండగా, మిగిలిన సమయాన్ని ఫోన్లు, ఇతర యాప్‌లకు వినియోగిస్తున్నట్టు తేలింది. రాజారావు అనే మెకానిక్ ఫోన్‌లో స్క్రీన్ టైమ్ ఆరున్నర గంటలు ఉంది. ఇందులో మూడు గంటలు యూట్యూబ్‌కు, మరో గంటన్నర సమయాన్ని ఇన్‌స్టాగ్రామ్, 40 నిమిషాలు ఫేస్‌బుక్ కోసం వినియోగించినట్టు తేలింది. మిగిలిన సమయంలో గంట కాల్స్‌కు వినియోగించాడు.

ఇబ్బందులు తప్పవు..

గంటల తరబడి ఫోన్ వినియోగించడం వల్ల అనేక రకాల ఇబ్బందులు ఎదురవుతాయని వైద్యులు చెబుతున్నారు. డిజిటల్ స్క్రీన్‌ను అదే పనిగా చూడడం వల్ల కళ్లు పొడిబారడం, అస్పష్టమైన దృష్టి, తలనొప్పి, తీవ్రమైన అలసట, తలబరువుగా అనిపించడం వంటి సమస్యలు తలెత్తుతాయి. అతిగా ఫోన్ వినియోగించడం, పడుకునే ముందు వరకు ఫోన్ చూడడం వల్ల నిద్రలేమి సమస్యతో బాధపడే ప్రమాదం ఉంది. మొబైల్ స్క్రీన్ నుంచి వచ్చే బ్లూలైట్ మెలటోనిన్ ఉత్పత్తికి ఆటంకం కలిగిస్తుందని, ఈ హార్మోన్ నిద్ర రావడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. అదేవిధంగా తల కాస్త వంచి ఫోన్ చూస్తూ ఉండడం వల్ల మెడ, వెన్ను నొప్పి వంటి ఇబ్బందులు వేధిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

- స్క్రీన్ టైమ్ గురించి మాట్లాడింది 15 మందితో
- వీరిలో 18 ఏళ్లలోపు వారు ఐదుగురు. వీరిలో ముగ్గురి రోజువారీ స్క్రీన్ టైమ్ సగటున 9 గంటలు. ఇందులో మూడు నుంచి నాలుగు గంటలు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ కోసం, మరో రెండు గంటలు యూట్యూబ్, మరో గంట వాట్సాప్‌కు వినియోగిస్తున్నారు.
- 18 నుంచి 40 ఏళ్లలోపు వాళ్లు ఆరుగురు. వీరిలో ఇద్దరు మహిళలు, నలుగురు పురుషులు. మహిళలు సగటు ఫోన్ స్క్రీన్ టైమ్ ఆరు గంటలు. ఇందులో య్యూటూబ్‌కు కనీసం రెండు, మూడు మూడు గంటలు, గంటపాటు వాట్సాప్, మిగిలిన సమయం ఫోన్, ఇతర యాప్స్‌కు వినియోగిస్తున్నారు. పురుషుల సగటు ఫోన్ స్క్రీన్ టైమ్ ఎనిమిది గంటలు. వీరిలో ముగ్గురు విద్యార్థులు కాగా, ఒక యువకుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న యువకుడు ప్రతిరోజూ కనీసం పది గంటలు ఫోన్ వినియోగిస్తున్నాడు. ఉద్యో గపరమైన కార్యకలాపాలు కోసం రెండు గంటలు ఫోన్ యూజ్ చేస్తుండగా, మిగిలిన సమ యంలో రెండు గంటలు యూట్యూబ్, మరో గంటన్నర సమయం ఇన్‌స్టాగ్రామ్‌కు వెచ్చిస్తు న్నారు. మిగిలిన ముగ్గురు విద్యార్థుల్లో ఇద్దరు కనీసం ఐదు నుంచి ఏడు గంటలు ఫోన్ చూస్తున్నారు.
- 40 ఏళ్ల పైబడిన నలుగురి సగటు స్క్రీన్ టైమ్ ఐదు గంటలుగా ఉంది. ఇందులో ప్రైవేటు ఉద్యోగం చేసుకునే రామ్ రోజువారీ స్క్రీన్ టైమ్ ఐదు గంటలు. ఇందులో గంట యూట్యూబ్ కోసం వెచ్చిస్తుండగా, మరో గంట సామాజిక మాధ్యమాల్లోని అకౌంట్లు వీక్షించేందుకు, మరో గంటన్నర ఫోన్, మిగిలిన సమయాన్ని ఇతర యాప్స్ కోసం వెచ్చిస్తున్నారు. మిగిలిన ముగ్గురి స్క్రీన్ టైమ్‌లో కనీసం రెండు గంటలు యూట్యూబ్ కోసం వెచ్చిస్తుండగా, మరో గంట వాట్సాప్, మరో గంటన్నర ఫోన్లకు వినియోగిస్తున్నారు. మిగిలిన సమయాన్ని ఇతర యాప్స్ వినియోగానికి వెచ్చిస్తున్నారు.

ఇలా తెలుసుకోవచ్చు...

ప్రతి రోజు ఫోన్‌ను ఎంత సమయం వినియోగించామనే విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవచ్చు. స్మార్ట్ ఫోన్ వినియోగదారులు తమ ఫోన్ సెట్టింగ్స్‌లోకి వెళితే...అందులో డిజిటల్ వెల్‌బీయింగ్ అండ్ పేరెంటల్ కంట్రోల్స్ అని, కొన్ని ఫోన్లలో డిజిటల్ వెల్‌బీయింగ్ అనే ఆప్షన్ ఉంటుంది. ఈ ఆప్షన్ క్లిక్ చేస్తే ఓపెన్ చేసిన రోజు



ఎంత సమయం ఫోన్‌కు వినియోగించాం, అందులో ఏయే యాప్స్‌కు ఎంత సమయం కేటాయించామన్నది కనిపిస్తుంది. వ్యూ యాక్టివిటీ డిటైయిల్స్ ఆప్షన్‌ను క్లిక్ చేయడం ద్వారా మరింత సమాచారాన్ని పొందవచ్చు. నాలుగు వారాల ముందు సమాచారం కూడా వస్తుంది. రోజువారీ ఈ సమాచారాన్ని చూసుకోవడం ద్వారా దేనికి ఎక్కువ సమయాన్ని కేటాయిస్తున్నారో తెలుసుకోవచ్చు. అవసరం లేని వాటికి సమయాన్ని తగ్గించుకునేందుకు ఇది దోహదం పడుతుందని నిపుణులు చెబుతున్నారు.

'ఉక్కు'లో కాంట్రాక్టు కార్మికుడు అనుమానాస్పద మృతి



అశోక్‌రెడ్డి మృతదేహం

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో ఓ కాంట్రాక్టు కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. పెదగంట్యాడ ప్రాంతానికి చెందిన జి.అశోక్‌రెడ్డి (29) ఉక్కు కర్మాగారంలోని సింటర్ ప్లాంట్ విభాగంలో కాంట్రాక్టు కార్మికునిగా పని చేస్తున్నారు. సోమవారం బీ-షిఫ్ట్ విధులకు హాజరైన ఆయన డ్యూటీ ముగించుకుని రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. అయితే ఆయన విభాగం సమీపంలోని ఓ కాలువలో పడి మృతి చెంది ఉన్నట్టు మంగళవారం ఉదయం పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు వారు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, కేసు నమోదు చేసి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కాగా అశోక్‌రెడ్డి ద్విచక్ర వాహనంపై నుంచి కాలువలో పడి మృతి చెందారా, లేక మరేమైనా కోణం ఉందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు సాగిస్తున్నారు. కాగా మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మద్యం మత్తులో తండ్రిని చంపేశాడు



ఎంగలి దేముడు మృతదేహం

గోపాలపట్నం, అక్టోబరు 15: మద్యం మత్తులో కన్నతండ్రినే పీక కోసి హతమార్చాడో దుర్మార్గుడు. 88వ వార్డు పరిధి నరవ గ్రామంలో మంగళవారం జరిగిన ఈ సంఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. పెందుర్తి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నరవ శివారు మన్యపాలెం కాలనీలో ఎంగలి దేముడు (60) భార్య దేవి, కుమారులు గోపి, అచ్యుతరావులతో కలిసి ఉంటున్నారు. దేముడు కుటుంబీకులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా దేముడు పెద్ద కుమారుడు గోపి మద్యానికి బానిసై తరచూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో దసరా పండగ నుంచి పూటుగా మద్యం సేవిస్తూ కుటుంబీకులతో గొడవలు పడుతున్నాడు. మంగళవారం ఉదయం దేవి, అచ్యుతరావులు కూలి పని కోసం గ్రామంలోకి వెళ్లగా దేముడు ఇంటి వద్దే ఉన్నారు. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చిన దేవి, అచ్యుతరావులు రక్తపు మడుగులో విగతజీవిగా పడివున్న దేముడిని చూసి భోరున విలపించారు. అనంతరం అచ్యుతరావు ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారించారు. తన అన్నయ్య గోపి మద్యం సేవించి తండ్రితో రెండు మూడు రోజులుగా గొడవ పడుతున్నాడని, ఈ క్రమంలో తండ్రిని హతమార్చి ఉంటాడని పోలీసులకు తెలిపాడు. ఈ మేరకు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి సీఐ కె.సతీశ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా పరారీలో ఉన్న నిందితుడు గోపి కోసం గాలిస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.

యువతలో నైపుణ్యాభివృద్ధికి కృషి

- కేంద్ర మంత్రి జయంత్ చౌదరీ
- గీతంలో పలు విభాగాల సందర్శన



గీతంలో పలు విభాగాలను సందర్శిస్తున్న జయంత్ చౌదరీ. చిత్రంలో ఎంపీ శ్రీభరత్ ఉన్నారు

ఎండాడ, సాగర్‌నగర్ అక్టోబరు 15 : భారతీయ యువతలో నైపుణ్యాలను పెంపొందించడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందని, ముఖ్యంగా పరిశ్రమల అవసరాలు, యువతలో నైపుణ్యాలకు మధ్యలో ఉన్న అంతరాన్ని పూరించడానికి ఎప్పటికప్పుడు గ్యాప్ స్టడీ చేపడుతున్నామని కేంద్ర ప్రభుత్వ స్కిల్ డెవలప్‌మెంట్, ఎంట్రప్రెన్యూర్ షిప్ శాఖ మంత్రి జయంత్ చౌదరీ వివరించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని పలు విభాగాలను మంగళవారం కేంద్ర మంత్రి సందర్శించారు. వైద్య రంగంలోని వారికి నైపుణ్యాలను పెంచడానికి గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రిసెర్చ్ (జిమ్సర్) వైద్య కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని, డాక్టర్ మూర్తి ప్రయోగశాల, మేకర్స్ స్పేస్ అండ్ వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్‌లను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాజిక శాస్త్రాలు అభ్యసించే యువతకు సైతం ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు ప్రత్యేక ఇంటర్నెర్‌షిప్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జాతీయ స్థాయిలో నైపుణ్యాలను ప్రోత్సహించడానికి స్కిల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గీతం అధ్యక్షుడు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ బోధనతో పాటు పరిశోధనలకు అత్యంత ప్రాధ్యాన్యత ఇస్తున్నామని తెలిపారు. యువ పరిశోధకులను ప్రోత్సహించడానికి మూర్తి రీసెర్చ్ గ్రాంట్ రూపంలో పరిశోధన నిధులను కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గీతం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.గంగాధరరావు, గీతం విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, జిమ్సర్ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, జిమ్సర్ డీన్ డాక్టర్ ఎస్పీ రావు, స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ డీన్ ప్రొఫెసర్ కేఎస్ కృష్ణ గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు,స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డీన్ విభూతి సత్యదేవ్ పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని మహిళ దుర్మరణం

విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. తుని సమీపంలోని హంసవరం వద్ద రైల్వే ట్రాక్‌పై మహిళ మృతదేహం ఉందన్న సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి ప్రాథమిక దర్యాప్తు చేశారు. అన్నవరం నుంచి తుని వస్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెంది ఉంటుందని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి వివరాలు తెలియలేదని, ఆమె వయసు 40-45 మధ్య ఉంటుందని, నేరేడు రంగుపై పసుపు పూలతో ఉన్న పసుపు, నీలం రంగు కలిసిన చుడీదార్ ధరించి ఉందని తెలిపారు. మృతురాలి వివరాలు తెలిసినవారు జీఆర్పీ ఎస్ఐ జి.శ్రీనివాసరావుకు ఫోన్ చేసి (94906 19020) సమాచారమివ్వాలన్నారు.

కారు ఢీకొని అపార్టుమెంటు వాచ్‌మన్ మృతి



దాకమర్రి శ్రీను (ఫైల్ ఫొటో)

తగరపువలస, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : తీర్థయాత్రలకు వెళ్లి వారంరోజుల పాటు అన్ని పుణ్య క్షేత్రాలను సందర్శించి ఇంటికి వస్తున్న సమయంలో కారు ఢీ కొనడంతో అపార్ట్‌మెంట్ వాచ్‌మన్ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా గంట్యాడ మండలం కొటారుబిల్లికి చెందిన దాకమర్రి శ్రీను (40) భీమిలిలోని ఒక అపార్టుమెంటు వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. దసరా సెలవులకు స్వగ్రామం నుంచి వచ్చిన తండ్రి సూరితో కలిసి, భార్య రమణమ్మ పిల్లలు దీపక్, సందీప్‌లను తీసుకుని వివిధ పుణ్యక్షేత్రాలను సందర్శించాడు విజయవాడలో కనకదుర్గను సందర్శించుకుని కుటుంబ సభ్యులతో సోమవారం రాత్రి తగరపువలసలో బస్సు దిగారు. భీమిలి రావడానికి ఆటో కోసం హైవేను దాటుతుండగా, విశాఖ నుంచి విజయనగరం వైపు వెళుతున్న కారు ఢీ కొనడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు తండ్రి సూరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమిలి పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవరు దుంగల జయంత్ ఏలూరు జిల్లా కోమటిపల్లి గ్రామానికి చెందిన వాడిగా గుర్తించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళవారం ఉదయం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భీమిలి సబ్ ఇన్‌స్పెక్టరు కె.హరీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి పట్టివేత

విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని ఆర్పీఎఫ్ ఏఎస్ఐ శివనారాయణ పట్టుకుని వారి నుంచి రూ.36,250 విలువ గల 7.250 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకుని జీఆర్పీ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రామారావుకు అప్పగించారు. ఒడిశాలోని కోరాపుట్‌కు చెందిన త్రినాథ్ సీసా, అరుణ్ కంబార్ అనే నిందితులు తమిళనాడుకు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారని రైల్వే పోలీసులు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచామని పేర్కొన్నారు.

తప్పుడు కేసులు పెడితే భయపడేది లేదు

- మాజీ మంత్రి అమర్‌నాథ్



గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టిన వైసీపీ నేతలు

సిరిపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నాయకులపై కేవలం రాజకీయ దురుద్దేశంతో తప్పుడు కేసులు బనాయిస్తున్నారని దీనికి తాము ఏ మాత్రం భయపడేది లేదని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. జీవీఎంసీ 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్‌పై నమోదు చేసిన అక్రమ రౌడీషీట్‌ను తొలగించాలని కోరుతూ మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పశ్చిమ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ మళ్ల విజయప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రౌడీ షీటా.. పొలిటికల్ షీటా..అంటూ ప్లకార్డులు చేత పట్టుకుని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ తప్పుడు కేసులతో వైసీపీ నాయకులను టీడీపీలోకి చేర్చుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. న్యాయపరంగా ఎదుర్కొంటామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్యే గణేష్‌కుమార్, నాయకులు రవిరెడ్డి, పీవీ సురేష్, జాన్‌వెస్లీ, కె.సతీష్, ఎం.అప్పారావు, దేవన్‌రెడ్డి, పి.రమణకుమారి, బి.శ్రీనివాసరావు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

గోస్తని పరిసరాల్లో ఇసుక తవ్వకాలకు నో

... 5వ పేజీ తరువాయి

ఆనుకుని పద్మనాభం, భీమిలి మండలాల్లో చేపట్టిన ఇసుక తవ్వకాల్లో భారీ అక్రమాలు జరిగాయి. స్థానికంగా ఉన్న కొందరు నాయకులు, ఇసుక వ్యాపారులు మిలాఖత్ అయి యథేచ్ఛగా తవ్వకాలు జరిపారు. దీనివల్ల జల వనరుల శాఖకు చెందిన చెక్ డ్యామ్‌లు, కాలువలకు ప్రమాదం ఏర్పడింది. పలు గ్రామాల్లో తాగునీటి పథకాలకు ముప్పు వచ్చింది. దీనికితోడు ఇసుక తవ్వకాల విషయంలో గ్రామాల్లో పలు వర్గాల మధ్య వివాదాలు ఏర్పడడంతో జిల్లా యంత్రాంగానికి తలనొప్పులు వచ్చాయి. ఇంత చేసినా గనుల శాఖకు ఆదాయం అంతంతమాత్రంగా వచ్చిన విషయాన్ని కొందరు అధికారులు గుర్తుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో గోస్తని నది పరీవాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలకు అనుమతి ఇవ్వరాదని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. విశాఖ జిల్లా అవసరాల కోసం తూర్పుగోదావరి, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో ఇరవైకు పైగా రీచ్‌లను ప్రభుత్వం కేటాయించింది. అక్కడి నుంచి ఇసుక రవాణాకు ఏర్పాట్లు చేసుకుంటే మంచిదని భావిస్తున్నారు.

ఆరోగ్యానికి ముప్పు

... 5వ పేజీ తరువాయి

టోటల్ పోలార్ కాంపౌండ్ (టీపీసీ) మీటర్స్ వినియోగిస్తారు. ఈ పరికరాలను వినియోగించి అధికారులు ఆయిల్‌ను ఎన్నిసార్లు, ఎంత సమయం మరిగించారో నిర్ధారిస్తారు. చిన్నపాటి కర్ర మాదిరిగా ఉండే ఈ పరికరాన్ని మరుగుతున్న నూనెలో ముంచుతారు. అందులో ముంచిన వెంటనే టీపీసీ పర్సంటేజీ తెలుస్తుంది. ఇది ఐదు నుంచి ఎనిమిది శాతం మాత్రమే ఉండాలి. ఒకటి కంటే ఎక్కువసార్లు ఆయిల్ వినియోగిస్తే ఆ సంఖ్య పెరుగుతుంది. ఇది ఆయిల్‌ను వినియోగించిన దానిని బట్టి 35 శాతం నుంచి 40 శాతం వరకు పెరుగుతుంది. ఈ విధంగా టీపీసీ విలువ పెరిగితే అత్యంత ప్రమాదమని ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అధికారులు పేర్కొంటున్నారు. టీపీసీ ఎక్కువ ఉన్న ఆయిల్‌లో వండిన ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల దీర్ఘకాలంలో కేన్సర్లు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తనిఖీల్లో టీపీసీ పర్సంటేజీ కౌంట్ ఎనిమిది శాతం కంటే ఎక్కువ ఉంటే వారికి జరిమానా విధించడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నట్టు జిల్లా ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ నందాజీ పేర్కొన్నారు. ఏటా పదుల సంఖ్యలో ఈ తరహా కేసులు నమోదు చేస్తున్నామని వెల్లడించారు. దీనిపై దుకాణదారులు, వ్యాపారులకు అవగాహన కలిగిస్తున్నట్టు తెలిపారు.

అటువంటి ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి

- డాక్టర్ ఎల్ఆర్ఎస్ గిరినాథ్

బయట ఆహారాన్ని విక్రయించే ప్రతిచోట ఆయిల్‌ను గంటల తరబడి మరిగిస్తుంటారు. ఎక్కువగా మరిగించిన ఆయిల్‌లో వండిన ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల ఫ్యాట్‌లో తేడా వస్తుంది. కొన్నిరకాల కెమికల్స్ రిలీజ్ అయి కేన్సర్‌కు దారితీస్తాయి. ముఖ్యంగా నల్లని ఆయిల్‌లో కార్బన్ ఉంటుంది. ఇది దీర్ఘకాలంలో అన్నవాహిక కేన్సర్‌కు కారణమవుతుంది. ప్రతిరోజూ తీసుకోవడం వల్ల చిన్న వయసులోనే కేన్సర్ వంటి ఇబ్బందులకు గురిచేయవచ్చు. ఇటువంటి ఆయిల్స్‌లో వండే ఆహార పదార్థాలకు దూరంగా ఉండడం మేలు.

మెరుగుపడనున్న ఇసుక సరఫరా

... 5వ పేజీ తరువాయి

కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ విశాఖ జిల్లా కోసం తూర్పుగోదావరి, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో 27 రీచ్‌లు కేటాయించారని, రెండు, మూడు తప్ప మిగిలినచోట్ల ఇసుక అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. ఎన్జీటీలో కేసులు ఉన్నందున మాన్యువల్‌గానే ఇసుక తవ్వకాలు చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఇసుక సరఫరా అవుతుందని, మంగళవారం నాటికి 740 బుకింగ్‌లు జరగ్గా, ప్రైవేటు వ్యక్తులకు సంబంధించి 178, ప్రభుత్వ అవసరాలకు 48 బుకింగ్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రెండు, మూడు రోజుల్లో ఆఫ్‌లైన్‌లో అంటే నేరుగా రీచ్‌ల వద్దకు వెళ్లి తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇసుక లభ్యతపై కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశామన్నారు. జిల్లాకు రోజుకు మూడు నుంచి మూడున్నర వేల టన్నులు ఇసుక అవసరమని, వర్షాలు తగ్గినందున ఇసుక లభ్యత పెరుగుతుందన్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా డోలా

... 5వ పేజీ తరువాయి

ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మంత్రి ఫోన్‌లో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులను సమన్వయం చేసుకుంటూ జిల్లా అభివృద్ధికి పాటుపడతానన్నారు. కూటమి ప్రభుత్వం ఎజెండా ను అమలు చేయడానికి అందరితో కలిసి పనిచేస్తానన్నారు. యువతకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమల ఏర్పాటుకు కృషిచేస్తామన్నారు. ప్రభుత్వ భూములు పరిరక్షణకు చర్యలు తీసుకుంటానన్నారు. త్వరలో విశాఖపట్నం వచ్చి అందరితో సమావేశమై జిల్లాలో సమస్యలు, ఇతరత్రా అంశాలను తెలుసుకుంటానన్నారు. ఆంధ్ర వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ చదివానని, నగరంపై తనకు అవగాహన ఉందని మంత్రి పేర్కొన్నారు.

చోటా నేతల కాసుల వేట

... 5వ పేజీ తరువాయి

టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కొందరు చోటానేతలు నగరంలోని ఒక బాణసంచా వర్తక సంఘం అధ్యక్షుని పేరుతో ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంతోపాటు పక్కనే ఉన్న హెలీప్యాడ్ గ్రౌండ్ బాణసంచా దుకాణాల ఏర్పాటు కోసం లీజుకు కావాలని దరఖాస్తు చేయించారు.ఏయూ అధికారులపై ఒత్తిడి చేసి ఈనెల ఏడున అనుమతులు తీసుకున్నారు. రెండు మైదానాలతోపాటు ఎంవీపీలోని ఏఎస్ రాజా కాలేజీ మైదానంలో కలిపి సుమారు 500 దుకాణాలు ఏర్పాటుకు వీలుగా ఒక కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. సరుగుడు కర్రలు, జింక్ రేకులతో ఒక్కో దుకాణం ఏర్పాటు చేయడానికి రూ.పది వేలకు కాంట్రాక్టు ఇచ్చారు. బాణసంచా దుకాణం ఏర్పాటుచేసేందుకు ఆసక్తి ఉన్న వ్యాపారులతో సంప్రతింపులు జరుపుతూ ఒక్కో దుకాణాన్ని రూ.లక్ష చొప్పున విక్రయించి సొమ్ము చేసుకున్నారు.

మెడ్‌టెక్ జోన్‌కు కేంద్ర మంత్రి జయంత్

... 5వ పేజీ తరువాయి

నారా చంద్రబాబునాయుడు ముందుచూపుతో ఈ ప్రాజెక్టును ప్రారంభించారని ప్రశంసించారు. ఆరోగ్య సంరక్షణ రంగం, విద్య, నైపుణ్యాభివృద్ధిలో ఏఎంటీజెడ్‌కు కేంద్రం అన్ని విధాలా సహకారం అందిస్తుందన్నారు. మెడ్‌టెక్ జోన్ ఎండీ, సీఈవో జితేంద్రశర్మ మాట్లాడుతూ కృత్రిమ అవయవాలు, అత్యాధునిక సీటీ స్కాన్, భారతదేశ మొట్టమొదటి క్యాథ్ ల్యాబ్ తయారీలో పురోగతి, హెల్త్ కేర్ వంటి విషయాలను కేంద్ర మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా ఇక్కడ తయారైన వైద్య పరికరాలను కేంద్ర మంత్రి పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు.